



Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 91 | ఆదివారం 31 ఆగస్టు 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi




## ఓట్ల తొలగింపు దేశానికే ప్రమాదం

**- సురవరానికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఇస్తాం: తెలంగాణ సిఎం**

**- గొప్ప ప్రజాస్వామికవాది : రాఘవులు**

**సురవరం జీవితం అందరికీ ఆదర్శం :డి రాజా**

హైదరాబాద్ - సూర్య వాస్తవం, ఆగస్టు 30

వన్ నేషన్- వన్ ఎలక్షన్ కాదనీ, వన్ పర్సన్.. వన్ పార్టీ ఎలక్షన్ అనీ, ఇదే బిజెపి విధానమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే నిలబెట్టామని తెలిపారు. దేశంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో సురవరం సుధాకర్‌రెడ్డి లాంటివారు ఎంతో అవసరమని చెప్పారు. సువరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను సిపిఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించారు. సురవరం చిత్రపటానికి సిఎం రేవంత్‌రెడ్డి సహా పలువురు పూలమాలవేసి నివాళులర్పించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే - మిగతా 2లో..

## ఓట్ల చోరీ వెనుక ఆ ముగ్గురు..

**- బీహార్ ర్యాలీలో రాహుల్ గాంధీ**

**- ర్యాలీలో పాల్గొన్న అఖిలేశ్ యాదవ్**

ఆరా - సూర్య వాస్తవం, ఆగస్టు 30

బిజెపి, ఆర్ఎస్ఎస్, కేంద్ర ఎన్నికల సంఘం కలిసి దేశంలో ఓట్ల చోరీకి పాల్పడుతున్నా యని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ ఆరోపించారు. బీహార్‌లో ఓటర్ అధికార్ యాత్రలో భాగంగా శనివారం ఆరాలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌తో కలిసి రాహుల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొన్న రాహుల్ గాంధీ.. బీహార్‌లో నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర



సవరణ(సర్) దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థపై జరిపిన దాడిగా విమర్శించారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా - మిగతా 2లో..

## చైనాలో మోదీకి ఘన స్వాగతం

- 'వందేమాతరం' నినాదాలతో హోరెత్తిన విమానాశ్రయం
- షాంఘై సదస్సు కోసం చైనాలోని టియాంజిన్‌కు చేరుకున్న ప్రధాని మోదీ
- విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికిన ప్రవాస భారతీయులు
- 'వందేమాతరం', 'భారత్ మాతా కీ జై' నినాదాలతో మార్మోగిన పరిసరాలు
- నేడు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో మోదీ భేటీ
- సోమవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో కీలక సమావేశం
- సరిహద్దు ఉద్రిక్తతల తర్వాత జిన్‌పింగ్‌తో భేటీకి పెరిగిన ప్రాధాన్యం



చైనా - సూర్య వాస్తవం, ఆగస్టు 30

షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు చైనాకు చేరుకున్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఘన స్వాగతం లభించింది. శనివారం సాయంత్రం టియాంజిన్‌లోని బిన్హాయ్ - మిగతా 2లో..




## కుప్పానికి రెండేళ్ల ముందే కృష్ణా పుష్కరాలు

- రాయలసీమకు నీళ్లు వస్తే వైసీపీకి జీర్ణం కాదు
- నాటకాలు ఆడడం వైసీపీకి అలవాటు.. నీళ్లు తేవడం ఎన్డీఏకు అలవాటు
- కృష్ణమ్మను కుప్పానికి తెచ్చాను మాట నిలబెట్టుకున్నాను
- రప్పా రప్పా రాజకీయాలంటే ఏంటో పులివెందుల ప్రజలు వైసీపీకి చూపారు
- పోలవరం-బనకచర్లతో కరవు శాశ్వతంగా దూరం
- నదుల అనుసంధానంతో కలిగే లాభాలను తెలంగాణ నేతలు అర్థం చేసుకోవాలి
- స్త్రీ శక్తితో ఆటో డ్రైవర్లకు ఇబ్బంది ఉండదు వారినీ ఆదుకుంటాం
- 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన కుప్పం ప్రజల రుణం తీర్చుకుంటా
- కుప్పం బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- 2014-19 మధ్య కాలం నాటి అసెంబ్లీలో జరిగిన చర్చ వీడియోను సభలో ప్రదర్శించిన సీఎం

కుప్పం - సూర్య వాస్తవం, ఆగస్టు 30

రాయలసీమ అభివృద్ధికి బ్లూ ప్రింట్ సిద్ధం చేసుకున్నాం అన్ని రంగాల్లోనూ సీమను అభివృద్ధి చేసేలా మా దగ్గర ప్రణాళికలున్నాయి. దీంట్లో భాగంగానే రాయలసీమకు హంద్రీ-నీవా కాల్వల విస్తరణ ద్వారా కుప్పం చిట్ట చివరి భూములకు నీటిని అందించా మని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు తెలిపారు. రాయలసీమకు నీళ్లు వస్తే వైసీపీకి జీర్ణం కాదు. వైసీపీకి నాటకాలు ఆడడం అలవాటు... ఎన్డీఏకు నీళ్లు తేవడం అలవాటు." అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శనివారం కుప్పం బ్రాంచ్ కెనాల్ వద్ద కృష్ణమ్మకు సీఎం చంద్రబాబు జలహారతి ఇచ్చారు. హంద్రీ-నీవా కాల్వల విస్తరణ ద్వారా కృష్ణా జాలాలు కుప్పం చివరి భూములకు చేరాయి. శ్రీశైలం నుంచి 738 కిలో మీటర్లు ప్రయాణించి కృష్ణమ్మ కుప్పానికి చేరుకుంది. దీంతో కుప్పం ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. ఈ సందర్భంగా కుప్పంలో పర్యటించిన చంద్రబాబు తన నివాసం నుంచి కుప్పం బ్రాంచ్ కెనాల్ వద్దకు ఆర్టీసీ బస్సులో - మిగతా 2లో..



## 18 నుంచి వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు

**- 14, 15న తిరుపతిలో మహిళా పార్లమెంటేరియన్ సమావేశం**

**- స్పీకర్ అయ్యన్న**

అనకాపల్లి - సూర్య వాస్తవం, ఆగస్టు 30

సెప్టెంబరు 18 నుంచి వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయని శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. శనివారం ఆయన మీడియాకు ఓ వీడియో ద్వారా తన నియోజకవర్గమైన నర్సీపట్నంలో జరుగుతున్న అభివృద్ధి పనులను తెలిపారు. 14, 15 తేదీల్లో తిరుపతిలో మహిళా పార్లమెంటేరియన్ సమావేశం జరగనుందని, దేశంలోని అన్ని రాష్ట్రాల మహిళా శాసన సభ్యులు సహా సుమారు 300 మంది హాజరు కానున్నారని తెలిపారు. ఈ సమావేశాలకు - మిగతా 2లో..

## కృష్ణమ్మకు జలహారతిచ్చిన సీఎం చంద్రబాబు

- కుప్పం చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు
- హంద్రీ-నీవా కాల్వల విస్తరణ పనుల ద్వారా కుప్పం చివరి భూములకు చేరిన కృష్ణా జలాలు
- శ్రీశైలం నుంచి 738 కిలో మీటర్లు ప్రయాణించి కుప్పానికి చేరుకున్న కృష్ణమ్మ.
- పంచెకట్టుకుని సంప్రదాయ పద్ధతిలో కృష్ణమ్మకు జలహారతి ఇచ్చిన ముఖ్యమంత్రి

కుప్పం- సూర్య వాస్తవం, ఆగస్టు 30

చిత్తూరు జిల్లా కుప్పంలో శనివారం అద్భుతమైన సంఘటన ఆవిష్కృతమైంది. ఎండిపోయిన గుండెలకు తడి తగిలితే ఎలా ఉంటుందో అలా బీడు వారిన ఆ భూములకు కృష్ణా జలాల రాకతో పచ్చటి పచ్చటి పొలాలు పురుడు పోసుకున్నాయి. ప్రకృతి పరవశించి పోయింది కుప్పం ప్రజలు మురిసిపోయారు. దశాబ్దాల క్రితం కరువుకు కేరాఫ్ అడ్రస్ గా ఉన్న కుప్పం నేల నేడు కృష్ణాజలాలతో పులికించింది. కృష్ణ పుష్కరాలను ముందస్తుగా కుప్పంలో నిర్వహిస్తున్నారా అన్నట్లుగా నియోజకవర్గం నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా తరలివచ్చిన జనం హంద్రీనీవా జలాలను చూసి పులకించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా అసెంబ్లీ సాక్షిగా కుప్పం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అనతి కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు హంద్రీనీవా s - మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


## బాలయ్యకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కారం

- హాజరైన బండి సంజయ్, నారా లోకేశ్
- భారత సినీ చరిత్రలో బాలయ్య సరికొత్త రికార్డ్
- వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు
- 50 ఏళ్ల సినీ ప్రస్థానానికి గాను దక్కిన ప్రతిష్ఠాత్మక అవార్డు

హైదరాబాద్- సూర్య వాస్తవం, ఆగస్టు 30

ప్రముఖ నటుడు, హిందూపురం శాసనసభ్యుడు బాలకృష్ణ తన సినీ జీవితంలో ఒక అరుదైన మైలురాయిని అందుకున్నారు. ఆయన ప్రతిష్ఠాత్మకమైన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (గోల్డ్ ఎడిషన్)లో స్థానం సంపాదించారు. భారత చలన చిత్ర పరిశ్రమ నుంచి ఈ పురస్కారానికి ఎంపికైన తొలి నటుడిగా ఆయన అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. 50 ఏళ్లుగా చిత్ర - మిగతా 2లో..



## చైనాలో మోదీకి
# ఘన స్వాగతం

(మొదటిపేజీ తరువాయి)

అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు అక్కడ నివసిస్తున్న ప్రవాస భారతీయులు బ్రహ్మరథం పట్టారు. భారతీయ సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆయన్ను ఆహ్వానించారు. 'వందేమాతరం', 'భారత్ మాతా కీ జై' అంటూ దేశభక్తి నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది.జపాన్ పర్యటన ముగించుకుని నేరుగా చైనాకు వచ్చిన ప్రధానమంత్రి మోదీ, ప్రవాస భారతీయుల ఆత్మీయ స్వాగతంపై సంతోషం వ్యక్తం చేశారు. "చైనాలోని భారత సమాజం టియాంజిన్‌లో ఎంతో ప్రత్యేకమైన స్వాగతం పలికింది" అని ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా తెలియజేశారు. ఎస్‌సీవో సదస్సులో భాగంగా వివిధ దేశాల అధినేతలతో లోతైన చర్చలు జరపనున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఆదివారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో ప్రధానమంత్రి మోదీ కీలక ప్రసంగం చేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన పలువురు ప్రపంచ నేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు. ముఖ్యంగా ఆదివారం నాడు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో, సోమవారం నాడు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధానమంత్రి మోదీ సమావేశం కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఓట్ల చోరీ వెనుక
# ఆ ముగ్గురు..

(మొదటిపేజీ తరువాయి)

బీహార్‌లో చేపట్టిన ఓటర్ అధికార్ యాత్ర దేశవ్యాప్తంగా ఉద్యమంగా మారుతుందన్నారు. ఓటు అనేది దళితులు, మైనారిటీలు, మహిళలకు ఒక హక్కు అని రాహుల్ గాంధీ అన్నారు. భారత రాజ్యాంగం ఓటు హక్కును హామీని ఇస్తుందని రాహుల్ గాంధీ అన్నారు. రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుని ప్రజల ఓటు హక్కును తొలగించడం ద్వారా బిజెపి రాజ్యాంగంపై దాడి చేస్తోందని విమర్శించారు.

**'బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపుతారు'**

ఈ యాత్రలో పాల్గొన్న అఖిలేశ్ యాదవ్, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను పచ్చి బూటకపు నిర్ణయంగా అభివర్ణించారు. 'బిజెపికి రోజులు ముగిశాయి. ప్రజలు ఆ ప్రభుత్వాన్ని గద్దె దింపుతారు. దీనికి బీహార్ ఎన్నిక కీలకం కానున్నాయి. దేశం మొత్తం దీనిని గమనిస్తోంది. ప్రజలను వాడుకుని నాశనం చేసే పార్టీ బిజెపి. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా పనిచేయాలని ఆశించాం. కానీ అది ఇప్పుడు బిజెపి జుగాడ్ కమిషన్‌గా మారిపోయింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని 80 స్థానాల్లో బీజేపీ కేవలం 33 సీట్లు మాత్రమే గెలిచింది. అవధ్ (ఉత్తరప్రదేశ్ పాత పేరు) ప్రజలు ఇప్పటికే బీజేపీని గద్దె దించారు. ఇప్పుడు మగధ్ (బీహార్ పాత పేరు) ప్రజల వంతు వచ్చింది" అని అఖిలేశ్ యాదవ్ ఎద్దేవా చేశారు. కాగా, ఇక జార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఇతర మిత్ర పక్షాల ప్రతినిధులు, టిఎంసి నుంచి మాజీ క్రికెటర్ యూసుఫ్ పఠాన్, లలితేశ్ త్రిపాఠి సెప్టెంబర్ 1న జరిగే యాత్ర చివరి రోజు కార్యక్రమంలో పాల్గొననున్నారు.

## ఓట్ల తొలగింపు
# దేశానికే ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, జస్టిస్ ఎన్‌వి రమణ, సురవరం సతీమణి బివి విజయలక్ష్మి, టిపిసిసి అధ్యక్షులు బి మహేష్‌కుమార్‌గౌడ్, బిఆర్‌ఎస్ నేత బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎంపీ కెవిపి రామచంద్రరావు, ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, టీజేఎస్ అధ్యక్షులు కోదండరామ్, ప్రొఫెసర్ హరగోపాల్, కాశీం, సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత బి ప్రదీప్, ఎంసిపిఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్, ఆరెస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, ఎస్‌యుసిఐ(సి) రాష్ట్ర కార్యదర్శి మురహరి, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రాజా, సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న, సిపిఐ ఏపీ కార్యదర్శి కె రామకృష్ణ, తదితరులు ప్రసంగించారు.

**కలిసికట్టుగా పోరాడాలి : రేవంత్‌రెడ్డి**

రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో పాలకుల విపరీతమైన పోకడలను కట్టడి చేసేందుకు, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్, కమ్యూనిస్టులు, భావసారూప్యత కలిగిన వారమంతా కలిసి కట్టుగా పోరాడాల్సిన అవసరముందని అన్నారు. ప్రజాస్వామిక మూల సిద్ధాంతానికి విరుద్ధంగా కేంద్రంలో పాలన సాగుతోందన్నారు. ప్రజల ప్రాథమిక హక్కులను హరించే ప్రమాదకర పరిస్థితులున్నాయని చెప్పారు. సమాజంలో చైతన్యాన్ని పెంచేందుకు నిరంతరం శ్రమించిన కమ్యూనిస్టు యోధుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని కొనియాడారు. విద్యార్థి రాజకీయాల నుంచి జాతీయ రాజకీయాల వరకు ఎంత ఎత్తుకు ఎదిగినా ఆయన నమ్మిన సిద్ధాంతాన్ని వీడలేదన్నారు. ఏ జెండాను మోయడం గొప్పగా భావించారో చివరి శ్వాస వరకు ఆ జెండా నీడలోనే ఉండటం చాలా అరుదు అని అన్నారు. సురవరం సుధాకర్ రెడ్డికి రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు ఉండే విధంగా మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

**సమరశీల ఉద్యమాలకు సమాయత్తం కావాలి : రాఘవులు**

సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి గొప్ప ప్రజాస్వామికవాది అని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. పార్టీని నడిపిన తీరు, ప్రజలతో మమేకమైన పద్ధతి, ఉద్యమాలను నిర్వహించడంలో ఆయన చెరగని ముద్ర వేశారని అన్నారు. కమ్యూనిస్టు భావజాలానికి భిన్నంగా ఉండే వారినీ ఆయన ఆకర్షిస్తారని చెప్పారు. విషయం మీద రాజీపడకుండా అందర్నీ కలుపుకునిపోయే వ్యక్తిత్వం ఉందన్నారు. విశాల ప్రజానీకాన్ని, శక్తులను కలుపుకునిపోవడం ఇప్పుడు ఎంతో అవసరమని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యానికి, లౌకికవాదానికి, హేతువాద భావజాలానికి తీవ్ర ప్రమాదం ఏర్పడిందన్నారు. వాటిని రక్షించుకునేందుకు సమరశీల ఉద్యమాలకు సమాయత్తం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

**సురవరం జీవిత సామాజిక కార్యకర్తలకు,**
**రాజకీయ పార్టీలకు ఒక సందేశంగా మారాలి : డి.రాజా**

దేశం రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కోసం సురవర సుధాకర్ రెడ్డి నిబద్ధతతో నిలబడి పోరాడారని, ఆయన జీవితం నేటి సామాజిక కార్యకర్తలకు ఆదర్శం కావాలని, దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు ఒక సందేశంగా మారాలని డి.రాజా అన్నారు. దేశం నేడు క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటుందని, మితవాద శక్తులు నేరుగా రాజ్యాంగంపైనే దాడి చేస్తున్నాయని, ఇలాంటి పరిస్థితిలో సుధాకర్ రెడ్డి మరణం దేశానికే తీరని లోటని చెప్పారు.

## కుప్పానికి రెండేళ్ల ముందే
# కృష్ణా పుష్కరాలు











(మొదటిపేజీ తరువాయి)

మహిళలు, రైతులతో కలిసి చేరుకుని జలహారతి ఇచ్చారు. సంప్రదాయ పద్ధతిలో పంచెకట్టుకుని కృష్ణమ్మకు జలహరతి అందించారు. వేద మంత్రోచ్చారణల మధ్య కృష్ణమ్మకు పసుపు, కుంకమ సమర్పించి జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా పరమసముద్రంచెరువు సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... 'నన్ను 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించి ఆదరించిన నా కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలు తీసుకురావడంతో నా జన్మ ధన్యమైంది. నా సంకల్పం నెరవేరింది. నా ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. కృష్ణా పుష్కరాలు 2028లో వస్తుంటే కుప్పానికి మాత్రం రెండేళ్లు ముందే వచ్చాయి. కుప్పం ప్రజలు నన్ను ఇంటి బిడ్డగా ఆదరించారు. వారికి నేను ఏం చేసినా తక్కువే' అని చంద్రబాబు అన్నారు.

**ఎన్టీఆర్ సంకల్పాన్ని నెరవేర్చాం**

"ఆనాడు ధవళేశ్వరం, ప్రకాశం బ్యారేజ్ నిర్మాణంతో కాటన్ దొర... కృష్ణా, గోదావరి జిల్లాల పరిస్థితి మార్చేశాడు. అందుకే కాటన్ దొరను అక్కడి ప్రజలు ఆరాధిస్తారు. అలాగే ఎన్టీఆర్ కృష్ణా మిగులు జలాలు సీమకు తేవాలని సంకల్పం చేశారు. సీమను సస్యశ్యామలం చేయాలని కలలు కన్నారు. సీమలో పశువులను బతికించుకోవడానికి రైళ్లలో నీళ్లను తెప్పించిన పరిస్థితి నాడు ఉండేది. వేరుశనగ పంట వేస్తే కనీసం విత్తనాల ఖర్చు కూడా వచ్చేది కాదు. సీమలో ఇలాంటి పరిస్థితిని మార్చాలనే సంకల్పంతో 1999లో హంద్రినీవాను నేనే ప్రారంభించాను.' 2025 నాటికి పరమసముద్రానికి కృష్ణా జలాలు తెచ్చామని సీఎం చంద్రబాబు అన్నారు. 'శ్రీశైలం మల్లన్న పాదాల చెంత నుంచి కుప్పం మల్లన్న వద్దకు కృష్ణా జలాలను తెచ్చాం. గంగమ్మ కరుణించింది... కృష్ణమ్మ తరలి వచ్చింది. 2014-19 మధ్య సీమలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై రూ.12,441 కోట్లు ఖర్చు పెట్టాం. వైసీపీ కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టింది. ఎన్నికల ముందు గేట్లతో సెట్టింగులు వేసి డ్రామాలాడారు. నీళు కూడా బయట నుంచి తెచ్చి వదిలారు. వారు విమానం ఎక్కేలోగానే ఆ నీరు ఇంకిపోయింది. అబద్ధాలు చెప్పడంలో వైసీపీ దిట్ట. అసాధ్యాలు సుసాధ్యం చేయడంలో ఎన్డీఏ దిట్ట. నేను వెళ్లేలోగా నీరు ఇంకిపోతుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రతి చెరువుకు నీరిచ్చే బాధ్యత నాది." అని సీఎం హామీ ఇచ్చారు.

**టీడీపీకి నీటి విలువ తెలుసు**

"నీటి విలువ తెలిసిన పార్టీ తెలుగుదేశం. వైసీపీ లాంటి పార్టీలకు నీటి విలువ, రైతు సమస్యలు ఎప్పటికీ తెలియవు. 100 రోజుల కార్యాచరణ లక్ష్యంతో రూ.3,850 కోట్లు మంజూరు చేశాం. కాల్వలు వెడల్పు చేశాం. నాలుగు నెలల్లో 40 టీఎంసీల నీరు తెచ్చాం. పది రిజర్వాయర్లను నింపాం. చెరువులను నింపుతున్నాం. సీమ జిల్లాల్లో 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందుతుంది. పరిశ్రమలకు కూడా నీరు లభిస్తుంది. వచ్చే ఏడాదికి చిత్తూరు చివరి భూములకు కూడా నీరందిస్తాం. పీలేరు, పుంగనూరు, చంద్రగిరి, పూతలపట్టు, చిత్తూరు, జీడీ నెల్లూరు నియోజకవర్గాల ప్రజలకు దీంతో ప్రయోజనం కలుగుతుంది. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ద్వారా వంశధార-పెన్నా నదుల అనుసంధానం చేయవచ్చు. ఇదే జరిగితే రాయలసీమకే కాదు.. రెండు తెలుగు రాష్ట్రాలకు శాశ్వతంగా కరవు అనేదే ఉండదు. తెలంగాణ ప్రజలు, నేతలు కూడా నదుల అనుసంధానం వల్ల కలిగే ప్రయోజనాలను అర్థం చేసుకోవాలి. నా 45 ఏళ్ల రాజకీయ జీవితంలో నీటి నిర్వహణపైనే దృష్టి పెట్టాను. నీరు-మీరు, నీరు-చెట్టు, చెక్ డ్యాములు, సాగు నీటి సంఘాలు, వాటర్ షెడ్లు అంటూ నీటి నిర్వహణ కోసం ప్రయత్నించాను. పరుగెత్తే నీటిని నడిపించాలి... నడిచే నీటిని నిలపాలనే సూత్రంతో పనిచేశాను. కుప్పం సహా సీమలోని ప్రతి చెరువునూ నింపుతాం. చెరువులను నింపితే వర్షాభావ పరిస్థితులు వచ్చినా తట్టుకోగలం" అని సీఎం అన్నారు.

**రాక్షసుల్లా అడ్డు పడుతున్నారు**

"రాష్ట్రాభివృద్ధికి యజ్ఞం చేస్తుంటే... కొందరు రాక్షసుల్లా అడుగడుగునా అడ్డుపడుతున్నారు. తప్పుడు ప్రచారాలతో ప్రతి మంచి పనికీ అడ్డంకులు సృష్టిస్తున్నారు. చేతనైతే అభివృద్ధి, సంక్షేమంలో పోటీ పడాలి. మొన్నటి ఎన్నికల్లో సీమ ప్రజలు 52 సీట్లకు గాను వాళ్లకు 7 ఎమ్మెల్యే సీట్లు ఇచ్చినా వారికి బుద్ధి రాలేదు. ప్రతిపక్షం అని చెప్పుకుంటున్న వైసీపీ విషవృక్షంలా తయారైంది. తన ఉనికి చాటుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. అయితే వారి కుట్రలకు కాలం చెల్లింది. ప్రజలు చైతన్యంతో కుట్రలు బద్దలు కొడుతున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి కుప్పంలో తెలుగుదేశాన్నే గెలిపిస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న కుప్పంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలని ప్రయత్నించారు. రప్పా రప్పా రాజకీయం చేస్తామని బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికల్లో రప్పా రప్పా రాజకీయం ఎలా ఉంటుందో ప్రజలే వారికి చూపించారు. ఎన్ని అడ్డంకులు కల్పించినా, ఇబ్బందులు సృష్టించినా, అభివృద్ధి చేస్తున్నాం.. సంక్షేమమూ చేపడుతున్నాం." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ఆటో డ్రైవర్లకూ అండగా ఉంటాం**

"ఉచిత బస్సు ప్రయాణంతో ఆడబిడ్డలంతా సంతోషంగా ఉన్నారు. స్త్రీ శక్తితో ఆటో డ్రైవర్లు ఇబ్బంది పడకుండా చూస్తాం. వారిని కూడా ఆదుకుంటాం. ఆటో డ్రైవర్లకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేస్తాం. మెగా డీఎస్సీ ద్వారా టీచర్ల రిక్రూట్మెంట్ చేపడుతున్నాం. కుప్పం నుంచి కూడా 50 మంది టీచర్లు ఎంపికయ్యారు. కుప్పం నియోజకవర్గానికి ఒకప్పుడు టీచర్లే వచ్చే వారు కారు.. ట్రాన్సఫర్లు చేయించుకుని వెళ్లిపోయేవారు. కానీ ఇప్పుడు కుప్పం యువతీ, యువకులే టీచర్లయ్యారు. తల్లికి వందనం అందరికీ ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులను ఆదుకుంటున్నాం. అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశాం. పెన్షన్లు ఇస్తున్నాం. దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. ఇలా ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ పాలన చేస్తున్నాం. కుప్పానికి 12 పరిశ్రమలు వచ్చాయి. రూ.3908 కోట్లు పెట్టుబడులు, 15600 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు, 26581 మందికి పరోక్ష ఉపాధి లభిస్తుంది. ఐ-ఫోన్ ఛాసిస్ ఉత్పత్తి చేసేలా హిందాల్కో సంస్థ యూనిట్టును ప్రారంభించబోతోంది. కుప్పాన్ని ఇతర రాష్ట్రాలకు కనెక్ట్ చేస్తూ పెద్ద ఎత్తున రహదారుల నిర్మాణం జరుగుతోంది. ప్రపంచంలోని టెక్నాలజీనంతా కుప్పానికి తెస్తాను." అని చంద్రబాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల, చిత్తూరు జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## 18 నుంచి వర్షాకాల
# అసెంబ్లీ సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇతర విషయాలపైనా మాట్లాడారు. మహిళా పార్లమెంటేరియన్ సమావేశాన్ని 14న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. 15న ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్, జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరవుతారని చెప్పారు.

# బాలయ్యకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కారం

(మొదటిపేజీ తరువాయి)

పరిశ్రమకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా బాలకృష్ణకు ఈ గౌరవం దక్కింది. హైదరాబాద్‌లో వైభవంగా జరిగిన ఒక కార్యక్రమంలో బాలకృష్ణ ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, ఆంధ్రప్రదేశ్ ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారి చేతుల మీదుగా బాలకృష్ణ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ బాలకృష్ణపై ప్రశంసల వర్షం కురిపించారు. "ఒక చరిత్ర రాయాలన్నా, దాన్ని తిరిగి రాయాలన్నా అది ఒక్క బాలయ్య బాబుతోనే సాధ్యం. ఆయన అందరికీ బాలయ్య అయితే, నాకు మాత్రం ముద్దుల మావయ్య" అని అన్నారు. 50 ఏళ్లుగా సినిమా, రాజకీయ రంగాలలో ఆయన తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని లోకేశ్ కొనియాడారు.

బాలకృష్ణ ఎప్పుడూ యంగ్ అండ్ ఎనర్జిటిక్‌గా ఉంటారని, ఆయన సినీ ప్రస్థానంలో చారిత్రక, జానపద, ఆధ్యాత్మికం, సైన్స్ ఫిక్షన్ వంటి ఎన్నో విభిన్న జానర్లలో నటించి మెప్పించారని గుర్తుచేశారు. "బాలయ్య బాబుది భోళాశంకరుడి మనస్తత్వం, అందుకే సినీ పరిశ్రమ ఆయన్ను అంతగా ప్రేమిస్తుంది. బసవతారకం ఆసుపత్రి ఆయనలోని మానవత్వానికి నిదర్శనం. ఓటీటీలో కూడా 'అన్‌స్టాపబుల్' అంటూ అద్భుతంగా రాణించారు. ఆయనకు ఈ పురస్కారం రావడం తెలుగు జాతికి గర్వకారణం" అని లోకేశ్ పేర్కొన్నారు.

# బాలయ్యకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కారం

(మొదటిపేజీ తరువాయి)

కాలువ ద్వారా కృష్ణ జలాలను కుప్పంకు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో కృష్ణా జలాలకు జలహారతి ఇవ్వడానికి కుప్పానికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు నేతలు, అధికారులు, కుప్పం ప్రజలు, శనివారం అఖండ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పరమసముద్రం చెరువు వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. వేద మంత్రోచ్చారణల మధ్య కృష్ణమ్మకు పసుపు, కుంకుమ సమర్పించి జలహరతి ఇచ్చారు. జలహరతి ఇస్తున్న సమయంలోజై చంద్రబాబు అంటూ పెద్ద ఎత్తున కుప్పం ప్రజల నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కుప్పం బ్రాంచ్ కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ను చంద్రబాబు సందర్శించారు.అనంతరం మల్యాల ఎత్తిపోతల నుంచి కృష్ణా జలాలు కుప్పానికి చేరుకున్న తీరును వివరిస్తూ ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్ ను చంద్రబాబు తిలకించారు.మధ్యలో రిజర్వాయర్లను, చెరువులను ఏ స్థాయిలో నింపామనే విషయాన్ని సీఎంకు మంత్రి నిమ్మల రామనాయుడు, ఇరిగేషన్ అధికారులు వివరించారు. హంద్రీ-నీవా ద్వారా కుప్పం వరకు నీరు చేరిన విధానాన్ని వివరిస్తూ ప్రదర్శించిన మ్యాపులను సీఎం చంద్రబాబు పరిశీలించారు. రిజర్వాయర్లల్లో నీరు ఏ విధంగా నింపుతున్నాం ప్రవాహాలు వస్తున్న తీరును జనానికి అర్థమయ్యేలా సీసీ కెమెరాల ద్వారా లైవ్ లో చూపించే ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. నీటి విలువ, ఇరిగేషన్ కోసం ఎంత ఖర్చు పెడుతున్నామనే అంశాలను, ఎన్ని రోజుల్లో నీటిని తరలించామనే విషయాలను వివరిస్తూ ప్రత్యక్ష ప్రసారాన్ని ఇవ్వాలని సీఎం అధికారులను కోరారు. చిన్నారులకు, యువతకు నీటి విలువ, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై అవగాహన పెంచడంతోపాటు చరిత్ర కూడా తెలియచెప్పాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు తన ప్రసంగంలో పేర్కొన్నారు.

# సంపాదకీయం

## ఊపందుకొంటున్న స్వదేశీ ప్రచారం




శక్తివంతమైన, అభివృద్ధి చెందిన భారత్‌కు.. స్వయంసమృద్ధి చెందిన భారతదేశమే పునాది. రక్షణ, సాంకేతికత, ఇంధన, అంతరిక్షంతో పాటు తయారీ రంగాల్లో పురోగతి 2047 నాటికి మనల్ని అభివృద్ధి చెందిన భారత్‌గా నిలుపుతుంది'ఇటీవల 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి కార్యక్రమాలను నొక్కిచెబుతూ చేసిన వ్యాఖ్యలివి.యువత స్వదేశంలోనే జెట్ ఇంజిన్లు, సెమీకండక్టర్ చిప్స్, ఇతర సాంకేతిక ఉత్పత్తులను అభివృద్ధి చేయాలని కోరుతున్నా.

తద్వారా మనం స్వయంసమృద్ధి సాధించగలం" అని అన్నారు.స్వయంసమృద్ధి అంటే, కేవలం దేశానికే పరిమితం కాదని.. ఇతర దేశాలతో పరస్పర సహకారం కొనసాగిస్తూ శక్తిసామర్థ్యాలను, స్వయంప్రతిపత్తిని పెంపొందించుకోవడమని కూడా అన్నారు.కార్లు, ఫోన్ల తయారీ నుంచి వస్త్రాలు, ఆహార భద్రత వరకూ భారత్ గత కొన్నేళ్లుగా అద్భుతమైన పురోగతి సాధించింది.అయితే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో గందరగోళ పరిస్థితులు, భారత్‌పై అమెరికా 50 శాతం సుంకాల విధింపు వంటి వాటి కారణంగా, 'స్వదేశీ' ప్రచారం ఊపందుకుంటోంది.వ్యవసాయం, మైనింగ్, ఇనుము, ఉక్కు, వాహనాల విడిభాగాలు, పారిశ్రామిక యంత్రాలు, ఫర్నిచర్, తోలు, పాదరక్షల తయారీ, దేశీయ రక్షణ రంగ ఉత్పత్తులు, ఐటీ, ఇతర డిజిటల్ సేవల రంగాల్లో భారత్ స్వావలంబన సాధించింది.కానీ, ఇంకా విదేశీ ముడి పదార్థాలు, టెక్నాలజీ, రీసర్చ్‌పై ఆధారపడిన అనేక రంగాలున్నాయి.మొబైల్ ఫోన్లు, అత్యాధునిక ఎలక్ట్రానిక్ పరికరాల తయారీకి అవసరమైన సెమీకండక్టర్ చిప్స్ వంటి హైటెక్ ముడి వస్తువులను భారత్ దిగుమతి చేసుకుంటోంది.అంతేకాకుండా.. చైనా సాంకేతిక నైపుణ్యం, సరసమైన ధరల కారణంగా భారత్ ఈ వస్తువుల కోసం చైనాపై ఎక్కువగా ఆధారపడుతోంది.ఈ సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ రంగంలో స్వావలంబన సాధించే దిశగా భారత్ ఇప్పటికే విధానపరమైన నిర్ణయాల విషయంలో చొరవ తీసుకుంది.మేక్ ఇన్ ఇండియా, ఇండియా సెమీకండక్టర్ మిషన్, ప్రొడక్ట్ లింక్డ్ ఇన్సెంటివ్ వంటి స్కీముల ద్వారా భారత్‌లో సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తికి అనువైన వాతావరణాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది.ముడి పదార్థాలు/వస్తువుల లభ్యత గురించి ఎలిస్టా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ సీఎండీ సాకేత్ గౌరవ్ మాట్లాడుతూ, "మేం స్మార్ట్ టీవీలను తయారుచేస్తాం. వాటిలో వినియోగించే ముఖ్యమైన విడిభాగాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాలి. మా ఉత్పత్తులలో వినియోగించే అనేక భాగాలను ఇప్పటికీ దిగుమతి చేసుకుంటున్నాం. అవి భారత్‌లో తయారవడం లేదు" అని చెప్పారు.ఎలిస్టా కంపెనీ ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో రూ.250 కోట్లతో మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను ప్రారంభించింది."అలాగే భారతీయ బ్రాండ్లు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో ఒకటి ఏంటంటే.. ఇక్కడ తయారైన వస్తువులు నాణ్యత పరంగా బాగున్నప్పటికీ, మన వినియోగదారులు విదేశీ బ్రాండ్లనే ఇష్టపడతారు" అని సాకేత్ గౌరవ్ అన్నారు.అయితే, రానున్న ఐదేళ్లలో సెమీకండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ రంగంలో భారత్ స్వయంసమృద్ధి సాధిస్తుందని కూడా ఆయన అన్నారు."ఐదు నుంచి ఆరేళ్లలో ముఖ్యమైన విడిభాగాలను ఇక్కడే తయారు చేయగలమని ఆశిస్తున్నా. ప్రస్తుతం, అందుకు అవసరమైన టెక్నాలజీ, ప్రాసెస్ చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేవు" అని సాకేత్ గౌరవ్ చెప్పారు."భారత్‌లో తయారైన ఉత్పత్తులు విదేశీ బ్రాండ్ల కంటే తక్కువ ధరకే లభిస్తాయి. కానీ, వినియోగదారులు విదేశీ బ్రాండ్లనే ఇష్టపడుతున్నారు."ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల నుంచి టర్బైన్ల వరకు, పర్మినెంట్ మాగ్నెట్స్, లైటింగ్, రాడార్ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్ యుద్ధ పరికరాలు, అనేక ఇతర రోజువారీ నిత్యవసరాలతో సహా అనేక ఉత్పత్తుల తయారీకి అవసరమైన రేర్ ఎర్త్ మెటీరియల్స్ కోసం భారత్ దిగుమతులపైనే ఆధారపడుతోంది.భారత్ తనకు అవసరమైన రేర్ ఎర్త్ మెటీరియల్స్‌లో దాదాపు 99 శాతం దిగుమతి చేసుకుంటోంది. అందుకు చైనాపైనే ఎక్కువగా ఆధారపడి ఉంది.భారత్‌లో రేర్ ఎర్త్ మెటీరియల్స్‌ను రీసైక్లింగ్ చేసే అతిపెద్ద కంపెనీల్లో ఒకటైన అటెరో సీఈవో, కంపెనీ సహ వ్యవస్థాపకులు నితిన్ గుప్తా మాట్లాడుతూ, "భారత్ ప్రస్తుతం 99 శాతం రేర్ ఎర్త్ మెటీరియల్స్‌ను దిగుమతి చేసుకుంటోంది. కానీ, ఈ పరిశ్రమ పురోగతికి అనువైన వ్యవస్థను అభివృద్ధి చేసినట్లయితే.. భారత్ 70 శాతం అవసరాలను రీసైక్లింగ్ ద్వారా తీర్చుకోవచ్చు" అని అన్నారు.అటెరో కంపెనీ ఇటీవల తన సామర్థ్యాన్ని 300 టన్నుల నుంచి 30 వేల టన్నులకు పెంచుకుంది."చాలా ముఖ్యమైన ఉత్పత్తుల తయారీలో రేర్ ఎర్త్ మెటీరియల్స్ చాలా కీలకం. భారత్ ఈ విషయంలో స్వయంసమృద్ధి సాధించే దిశగా చర్యలు చేపట్టాల్సి ఉంది. భారత్‌లోనూ రేర్ ఎర్త్ మెటీరియల్స్ నిల్వలు ఉన్నాయి, కానీ ప్రస్తుతం వాటి మైనింగ్ జరగడం లేదు. ప్రపంచంలోని మొత్తం రేర్ ఎర్త్ మెటీరియల్స్‌లో 99 శాతం చైనా నుంచే వస్తున్నాయి, ఈ విషయంలో భారత్ ఇప్పటివరకూ పెద్దగా చేసిందేమీ లేదు" అని నితిన్ గుప్తా అన్నారు."రీసైక్లింగ్ హబ్‌గా మారడం ద్వారా భారత్ తన అవసరాలను తీర్చుకునే దిశగా ముందుకెళ్లొచ్చు. మనం మార్కెట్‌లో పోటాపోటీ ధరకు రీసైకిల్ చేయగలం, కానీ అది భారీ స్థాయిలో జరగాల్సిన అవసరముంది."అయితే, కేవలం రీసైక్లింగ్ ద్వారానే భారత్ అవసరాలు తీరతాయా? అనేదే ఇక్కడి ప్రశ్న. విషయంలో నితిన్ గుప్తా ఆశావహంగానే ఉన్నారు..2025 ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో, భారత్ 9.74 లక్షల టన్నుల డీఏపీ (డైఅమ్మోనియం ఫాస్ఫేట్)ను దిగుమతి చేసుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో డీఏపీ మొత్తం దిగుమతులు దాదాపు 45.7 లక్షల టన్నులు. యూరియా దాదాపు 56 లక్షల టన్నులు. ఎరువుల తయారీలో ఇది చాలా కీలకం.దేశీయంగా అవసరమైన ఖనిజాల కొరతతో పాటు అభివృద్ధి చెందిన మైనింగ్, ప్రాసెసింగ్ వ్యవస్థ లేకపోవడం.లిథియం, కోబాల్ట్, మెగ్నీషియం, నికెల్ వంటి ముఖ్యమైన ఖనిజాలకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉంది. అయితే, ఈ కీలకమైన ఖనిజ నిల్వలు భారత్‌లో పరిమితంగానే ఉన్నాయి. లేదంటే నిల్వలు ఉన్నప్పటికీ.. మైనింగ్ సాధ్యమయ్యే పరిస్థితి లేదు.ఆర్థిక వ్యవహారాల విశ్లేషకులు, జర్నలిస్ట్ నరేంద్ర తనేజా మాట్లాడుతూ, "భారతీయ పరిశ్రమలు ముడి చమురు, పెట్రోకెమికల్స్ దిగుమతులపై ఆధారపడి ఉన్నాయి. పెట్రోకెమికల్స్‌పై ఆధారపడని రంగం దాదాపుగా అరుదు. కానీ, ఈ అవసరాలన్నింటికీ భారత్ దాదాపుగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. భారత్‌లో ముడిచమురు నిల్వలు లేవని కాదు, కానీ అవి ఉన్నచోట్ల వాటిని వెలికితీయడంలోనూ సవాళ్లున్నాయి" అని అన్నారు.భారత్ దేశీయ రక్షణ రంగ ఉత్పత్తిని ప్రోత్సహించినప్పటికీ, రక్షణ పరమైన అవసరాల కోసం ఇప్పటికీ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడి ఉంది.యుద్ధ విమానాల నుంచి జలాంతర్గాముల వరకు, ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్‌ను కూడా భారత్ విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది.2023 గణాంకాల ప్రకారం, భారత్ తన రక్షణ బడ్జెట్‌లో 36 శాతం దిగుమతులపైనే ఖర్చు చేసింది.జెట్ ఇంజిన్లు, రాడార్ల వంటి హైటెక్ పరికరాలను భారత్ ఇప్పటికీ దిగుమతుల ద్వారానే సమకూర్చుకుంటోంది.ఇంకా, అధునాతన ఆయుధాల కోసం కూడా విదేశాలపై ఆధారపడుతోంది భారత్ దేశీయంగానూ రక్షణ రంగ ఉత్పత్తిని పెంచింది. 2014 - 15లో భారత్ రూ.46,429 కోట్ల విలువైన రక్షణ ఉత్పత్తులను తయారుచేయగా, అది 2023 - 24 నాటికి 1.27 లక్షల కోట్లకు పెరిగింది.

# విశాఖలో గూగుల్ డేటా సెంటర్



**విశాఖపట్టణం-సూర్య వాస్తవం, ఆగస్టు 30 :** ప్రముఖ దిగ్గజ సంస్థ గూగుల్ ఇప్పుడు వైజాగ్‌లోనూ అడుగు పెట్టనుంది. సుమారు రూ.50 వేల కోట్ల పెట్టుబడితో 1 గిగావాట్ డేటా సెంటర్ విశాఖ పట్నంలో ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. అంతేనా.. ఆసియా ఖండంలోనే ఇది అతిపెద్ద హైపర్‌స్కేల్ డేటా సెంటర్ కానుంది. గూగుల్ సంస్థ అమెరికా వెలుపల ఏర్పాటు చేసే అతిపెద్ద కేంద్రానికి సైతం విశాఖ వేదిక కానుంది. ఈ మేరకు గూగుల్‌కు చెందిన ఇన్వెస్ట్ ఇండియా ఎక్స్‌లో వెల్లడించింది. గూగుల్ ప్రతిపాదన గేమ్ ఛేంజర్ కానుంది. ప్రపంచానికి డిజిటల్ హబ్‌గా దేశానికి గుర్తింపు వస్తుందని జాతీయ పెట్టుబడుల ప్రోత్సాహక, సమన్వయ సంస్థ ఇన్వెస్ట్ ఇండియా తన ప్రకటనలో పేర్కొంది. ఇన్వెస్ట్ ఇండియా ప్రకటనలో ఇప్పుడు యావత్ ప్రపంచం ఫోకస్ ఏపీపై నిలిచింది. గూగుల్ క్లౌడ్, సెర్చ్, యూట్యూబ్, ఏఐ వర్క్‌ల పర్యావరణ వ్యవస్థ బలోపేతం చేసేందుకు ఈ డేటా సెంటర్ ఉపయోగపడనుంది. అంతేకాకుండా పరిశ్రమలు, స్టార్టప్‌లు, ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా ఏఐ సేవలను అందుబాటులోకి తీసుకురానుంది. విశాఖలో త్వరలో ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్.. దేశానికి చెందిన మొత్తం డేటా నిల్వ చేయనుంది. దీనివల్ల ఉగ్రమూక చేతిలోకి విలువైన డేటా చేరే అవకాశం తప్పుతుంది. అంతర్జాతీయ బ్యాండ్‌విడ్త్‌ను పెంచేందుకు 3 సబ్ మెరైన్ కేబుల్స్‌కు సరిపడా ల్యాండింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసి డేటా సెంటర్‌ను అనుసంధానిస్తుంది. ముంబయిలో గూగుల్‌కు చెందిన పియరింగ్, క్యాచీ సర్వర్లు ఉన్నాయి. అక్కడి నుంచి సముద్ర మార్గంలో కేబుల్ తీసుకోవడం సులువు అవుతుంది. డార్క్ ఫైబర్ ద్వారా తక్కువ ఖర్చుతో తీసుకోవాలని ప్రణాళికలు వేస్తున్నారు. డేటా సెంటర్ కూలింగ్ కోసం పెద్దఎత్తున నీరు అవసరం అవుతుంది. అందుకే డేటా సెంటర్ ఏర్పాటు కోసం గూగుల్ విశాఖ సముద్ర తీరాన్ని ఎంపిక చేసుకుంది.పైగా ఐటీ రంగంలో రూ.2 కోట్ల పెట్టుబడి పెడితే ఒకరికి ఉపాధి లభిస్తుందని అంచనా. ఆ లెక్కన గూగుల్ సంస్థ పెట్టే సుమారు రూ.50 వేల కోట్ల పెట్టుబడుల ఆధారంగా రాష్ట్రంలోని సుమారు 25 వేల మంది నిరుద్యోగులకు దశలవారీగా ప్రత్యక్ష ఉపాధి అవకాశం లభించనుంది. ఇక పరోక్షంగా మరో 50 వేల మందికి ఉపాధి లభించనుంది. అంతేకాకుండా డేటా సెంటర్ కోసం పునరుత్పాదక విద్యుత్‌ను వినియోగించాలని గూగుల్ నిర్ణయించింది. ఆ విద్యుత్ ప్రాజెక్టుల కోసం సుమారు రూ.20 వేల కోట్లు గూగుల్ ఖర్చు చేయనుంది. సముద్ర తీరం వెంట చిన్న హైడ్రో ప్రాజెక్టులు ఏర్పాటు చేసి, వాటి ద్వారా వచ్చే విద్యుత్‌ను గూగుల్ వినియోగించుకోనుంది.

# వైసీపీ ఉక్కు రాజకీయం




**విశాఖపట్టణం-సూర్య వాస్తవం, ఆగస్టు 30 :** ఏ రాష్ట్రంలోనైనా సరే ప్రతిపక్షాలు బలపడేది ప్రజా ఉద్యమాల ద్వారానే. ఇది చాలాసార్లు రుజువైన విషయం. ఏపీలో 2024 తర్వాత విపక్షాలకు కలిసివచ్చిన అలాంటి అంశాలు చాలా తక్కువ. చేసిన కొద్దిపాటి ఉద్యమాలు నిరసనలు రాష్ట్రం మొత్తాన్ని కదిలించే అంశాలు కావు. కొన్ని ముఖ్యమైన అంశాలు అలాంటివి దొరికినా వాటిని విపక్షాలు సరిగ్గా వాడుకోలేదనే చెప్పాలి. అలాంటి వాటిలో రాయలసీమ మామిడి రైతుల ఆందోళన, నెల్లూరు జిల్లా కర్రేడులో భూములు కోల్పోతున్న గ్రామస్తుల నిరసన, పెరిగిపోయిన విద్యుత్ బిల్లుల అంశాల వంటివి ముఖ్యం. ఇలాంటి ముఖ్యమైన అంశాలపై ఇంతవరకు విపక్షాలు కలిసికట్టుగా ముందుకు దిగిన ఉద్యమాలు లేనే లేవు. పోనీ ప్రధాన విపక్షాలుగా భావించే పార్టీలు ఒంటరిగానన్నా ఇలాంటి ముఖ్యమైన విషయాల్లో ఉద్యమానికి దిగాయా అంటే అదీ లేదు. అలాంటి తరుణంలో ప్రధాన విపక్షం వైసీపీకి ఒక ముఖ్యమైన ఆయుధంలా మారే ఛాన్స్ " విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ " అంశం ద్వారా వస్తోంది.'ఆంధ్రుల హక్కు -విశాఖ ఉక్కు' నినాదంతో ఎంతోమంది బలిదానాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ఇప్పుడు ప్రైవేటుపరం కాబోతున్న సూచనలు బలంగా కనిపిస్తున్నాయి.

ఒకపక్క స్టీల్ ప్లాంట్‌ని ఆదుకుంటామని చెబుతున్న కేంద్రం మరోవైపు "పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించి" గతంలో తీసుకున్న నిర్ణయా నికి కట్టుబడి ఉన్నామని చెబుతోంది. దీంతో వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు కార్మికులలతోపాటు సగటు తెలుగువాడు వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం అయిపోతుందన్న నమ్మకానికి దగ్గరవుతున్నారు. ప్రతి నెల వీఆర్ఎస్ తీసుకునే ఉద్యోగుల సంఖ్య పెరుగుతూ ఉండడంతో పాటు తాజాగా 32విభాగాలను ప్రైవేట్‌పరం చేశారంటూ వస్తున్న వార్తలు ఏళ్ల తరబడి ప్రైవేటీకరణ వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్న స్టీల్ ప్లాంట్ కార్మికులు ఉద్యోగుల నమ్మకంపై దెబ్బకొడుతున్నాయి. అయితే ప్రైవేటు పరం కాకుండా స్టీల్ ప్లాంట్‌ను కాపాడుతామంటూ కూటమి నేతలు చేస్తున్న ప్రకటనలు ప్రజల్లో నమ్మకాన్ని కలిగించలేకపోతున్నాయి అనేది వాస్తవం అని వామపక్ష నేతలు చెప్తున్నారు. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వారు చేస్తున్న పోరాటానికి బలం సరిపోవడం లేదు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై ఉద్యమించడానికి విపక్ష వైసిపికి ఇది అద్భుతమైన అవకాశమని ఎనలిస్టులు చెప్తున్నారు. వైసిపి అధికారంలో ఉన్న ఐదేళ్లు వారు చెప్పినట్టుగానే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రం నెమ్మదించింది. ప్రవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకోకపోయినప్పటికీ దానిపై ముందుకు కూడా వెళ్లలేదు. కాబట్టి ఐదేళ్లు స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకున్నాం అనే క్లయిమ్ వైసిపి నేతలు చేసుకుంటున్నారు. ఇప్పుడు దాన్ని ఆధారంగా చేసుకుని స్టీల్ ప్లాంట్ కార్మికులు ఉద్యోగులతో కలిసి ఉద్యమించే అవకాశం వైసీపీకి ఉంది. నిజంగా అలా చేస్తే ప్రజల్లో పార్టీ ఇమేజ్ కూడా పెరుగుతోంది. కానీ రాష్ట్రంలో తన ప్రత్యర్థులతో కలిసి ఉన్న బిజెపికి ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో కేంద్రంలో మద్దతిచ్చిన వింత పరిస్థితి వైసిపిది.చంద్రబాబు, పవన్ పై ఒంటికాలిపై లేచే జగన్మోహన్ రెడ్డి బీజేపీపై అంతే తీవ్రంగా ఈ అంశంపై పోరాడగల ధైర్యం చేస్తారా అనేది రాజకీయవర్గాల్లో చర్చగా మారింది. పోలవరం, అమరావతి, వైజాగ్ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ ఈ మూడు ప్రస్తుతం ఆంధ్రుల సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్నవి. అమరావతిపై వైసీపీ ఇప్పటికీ అస్పష్టమైన స్టాండ్ తోటే ఉంది. పోలవరం నిర్మాణాన్ని రివర్స్ టెండరింగ్ పేరుతో ఐదేళ్లు వెనక తీసుకుపోయిందంటూ టిడిపి పదే పదే ఆరోపణలు చేస్తున్నా దానికి సరైన కౌంటర్ వైసీపీ నుంచి రావడం లేదు. ఇక వారికి మిగిలింది వైజాగ్ స్టీల్ ప్లాంట్. కూటమి నేతల అస్పష్ట ప్రకటనల మధ్య స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం విపక్షాలు ఉద్యమిస్తే కచ్చితంగా ప్రజలు మద్దతు వారికి ఉంటుంది. మరి ఇలాంటి అవకాశాన్ని వైసిపి ఏ మాత్రం వాడుకుంటుందో చూడాలి అంటున్నారు ఎనలిస్ట్ లు.

# ఎమ్మెల్యేలకు పవన్ వార్నింగ్

**- నివేదికలు ముందు పెట్టిన జనసేనాని**



**విశాఖపట్టణం-సూర్య వాస్తవం**

జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పార్టీ ఎమ్మెల్యేల పనితీరుపై అంతర్గత సర్వే చేయించినట్లు తెలిసింది. కొందరి ఎమ్మెల్యేలపై అవినీతి ఆరోపణలు రావడంతో ఈ సర్వేను నిర్వహించారు. విశాఖలో జరిగిన పార్టీ ఎమ్మెల్యేలతో పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. వారి పని తీరును ఆయన వారి ముందుంచారు. అధికా రంలోకి వచ్చి ఏడాది అయిన తర్వాత జనసేన పార్టీ ఎమ్మెల్యేల పెర్ ఫార్మెన్స్ ను అంచనా వేశారు. గత కొంత కాలంగా జనసేన ఎమ్మెల్యేలపై ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా కొన్ని విషయాల్లో అంటే మద్యం, ఇసుక వంటి విషయాల్లో తలదూర్చడంతో పాటు కొన్ని కాంట్రాక్టుల పనుల్లో ఎమ్మెల్యేలు చేతివాటం ప్రదర్శించడం వంటివి ఆయన దృష్టికి వచ్చాయి. దీనిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. విశాఖలో మూడు రోజుల పాటు జరగనున్న పార్టీ విస్తృత స్థాయి సమావేశాల్లో మొదటి రోజున ఎమ్మెల్యేలతో విడివిడిగా సమావేశమై నియోజకవర్గాల్లో జరుగుతన్న అభివృద్ధి పనులను గురించి, సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు జనసేన క్యాడర్‌తో ఎమ్మెల్యల సంబంధాల గురించి కూడా పవన్ కల్యాణ్ ప్రశ్నించినట్లు తెలిసింది. గత ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన ముఖ్య కార్యకర్తలు అసంతృప్తిగా ఉండటాన్ని గుర్తించిన పవన్ కల్యాణ్ వారిని దూరం చేసుకుంటే పార్టీతో పాటు వ్యక్తిగతంగా మీకే నష్టమని ముఖం మీదనే తేల్చి చెప్పారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఒక ఎమ్మెల్యేకు దూకుడు తగ్గించుకోవాలని హితవు పలికినట్లు సమాచారం. మరొకవైపు తాను ఎమ్మెల్యేలకు ర్యాంకులు ఇస్తానని, ర్యాంకుల్లో దిగువ స్థాయి ఉన్న ఎమ్మెల్యేలు తమ పనితీరును మెరుగుపర్చుకోవాలని సూచించారు.ఉత్తరాంధ్ర జిల్లాకు చెందిన ఒక ఎమ్మెల్యేకు కూటమి నేతలను కూడా కలుపుకుని పోవాలని, గ్రూపులను కట్టవద్దని కొద్దిగా కటువుగానే హెచ్చరించినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. తాను ప్రతి నియోజకవర్గంలో పర్యటిస్తానని, ఆ సమయానికి ఎమ్మెల్యేలు సెట్ కావాలని, లేకుంటే ఇబ్బందులు పడతారని వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది.

## మెగా డీఎస్సీ 2025లో

# సత్తా చాటిన వ్యాయామ ఉపాధ్యాయులు









**పామిడి -సూర్య వాస్తవం, ఆగస్టు 30 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీ 2025లో పామిడి మండలానికి చెందిన ఏడు మంది వ్యాయామ ఉపాధ్యాయులు పీఈటి ఉద్యోగాన్ని పొందడం జరిగింది ఒకే మండ లంలో ఏడు మంది వ్యాయామ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించడం ఎంతో గర్వించదగ్గ విషయం అలాగే ఇందులో వంకరాజు కాల్వ గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు నరసింహ, సురేష్ చంద్ర వ్యాయామ ఉపాధ్యా యులుగా ఎంపిక కావడం జరిగింది ఇందులో పామిడి గ్రామానికి చెందిన వెంకటేష్, మహేష్ ,పామిడి శ్రీ చైతన్య పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యానియుగా పనిచేసిన హనుమేష్ అలాగే తంబళ్లపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు ఎదురూరు గ్రామానికి చెందిన హస్సెన్ వ్యాయామ ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపిక కావడం జరిగింది వీరిలో మహేష్ ఏ ఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తూ తనకు ఎంతో ఇష్టమైన వ్యాయామ వృత్తిపట్ల ఇష్టంతో పట్టు వదలకుండా వ్యాయామ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించడం జరిగింది వీరందరూ కూడా పామిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదవడం ఒక విశేషంగా చెప్పవచ్చు వీరికి వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎదగడానికి స్ఫూర్తినిచ్చిన ప్రస్తుతం మర్తాడు హెడ్ మాస్టర్ గా పనిచేస్తున్న నాగరాజు సార్ కి , నంద్యాల డిగ్రీ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ పనిచేస్తున్న శ్రీనివాసులు సార్ కి వీరు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ సందర్భంగా వీరికి కుటుంబ సభ్యులు పామిడి పట్టణ ప్రజలు, స్నేహితులు బంధుమిత్రులు అభినందనలు తెలియజేశారు.

# కనేకల్ మండలంలో సీపీఐ ధర్నా

**-విధులు నిర్వహించడంలో పూర్తిగా నిర్లక్ష్యం**
**-రోగులకు సరైన వైద్యం అందడం లేదు**
**కనేకల్ పట్టణ సిపిఐ పార్టీ**



**కనేకల్ -సూర్య వాస్తవం ఆగస్టు 30:** పేదలకు మెరుగైన వైద్యం అందడం లేదని ,విధులు నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని కనేకల్ మండల సిపిఐ పార్టీ శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర ధర్నా నిర్వహించారు. అనంతపురం జిల్లా కనేకల్ మండల సిపిఐ పార్టీ కార్యదర్శి ఎం గౌస్ పీర్, సహాయ కార్యదర్శి ముల్లా శర్మాస్ వలి ఈ సందర్భంగా మాట్లాడుతూ కనేకల్ మండల లో ఉన్నప్రభుత్వ ఆసుపత్రి ని గత టిడిపి ప్రభుత్వం రెండు కోట్లు రూపాయలు మంజూరు చేసి 30 పడుగుల ఆసుపత్రిని అభివృద్ధి చేసింది. ఆ ఆసుపత్రిలో రోగులకు వైద్య చికిత్స పరీక్షలు చేయటానికి అన్ని రకముల వైద్య పరీక్ష సామాగ్రి యంత్రాలను ఏర్పాటు చేశారు, ఆ యంత్రాల నుండి వైద్య పరీక్షలు చేసి వైద్యం అందిం చాల్సిన పేద ప్రజల రోగులకు వైద్యం అందక వారి పరిస్థితి వర్ణాతీతం గా మారింది. కనేకల్ పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రికి చుట్టుపక్కల పల్లెల నుండి గర్భిణీలు, బాలింతలు, కడుపునొప్పి ,తలనొప్పి తేలు కుట్టిన వారు ,కుక్క కాటుకి గాయపడి న ఇలాంటి అనేక రకాలైన వ్యాధితో ఆసుపత్రికి వస్తే సమయం కాని సమయం టైములో వస్తే ఆ ఆసుపత్రిలో ఉన్న వైద్య అధికారులు స్టాప్ డాక్టర్లు లేరని మీకువైద్యం చేయాలంటే సరిపడే మందులు లేవు, వైద్య పరీక్ష మిషనరీ కూడా లేవు కాబట్టి మెరుగైన వైద్యం కోసం పెద్ద పట్టణాలకి వెళ్లాలని సలహా ఇచ్చి ఆ రోగులకు ఒక ఇంజక్షన్ ,రెండు మాత్రలు ఇచ్చేసి ఆ పేషెంట్లు బంధువులకు హడావుడి చేసి భయపెట్టి తక్షణ మే అంబులెన్స్ ద్వారా అయినా లేదా ప్రైవేటు వాహనం ద్వారా అయినా అర్జెంటుగా పేషెంట్ సీరియస్‌గా ఉన్నాడని తక్షణమే పెద్ద హాస్పటల్ కి వెళ్లాలని భయం పెట్టి పంపుతున్నారు. డబ్బులు లేని నిరుపేదలు వైద్యం చేయించుకోవటానికి డబ్బులు లేక ఇలా వైద్యం అందాక పేద ప్రజల ప్రాణలు గాలిలో కలుస్తున్నాయి. ఇందుకు కారణం ప్రభుత్వ వైద్యఅధికారులు నిర్లక్ష్యమే ,ప్రభుత్వం ఏమో వేలాది రూపాయలు వైద్య అధికారులకు, సిబ్బందికి జీతాలు ఇచ్చి పేద ప్రజలకు వైద్యం అందించడానికి నియమిస్తే వారేమో వారి వృత్తిని విధులు నిర్వహించడం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. కాబట్టి తక్షణమే వైద్య జిల్లా అధికారులు వారి పైన తగిన చర్యలు తీసుకోవాలని సిపిఐ పార్టీగా డిమాండ్ చేస్తుంది.

ఈ కార్యక్రమంలో కనేకల్ మండల కార్యదర్శి ఎంగౌస్‌పీర్ ,మండల సహాయ కార్యదర్శి ముల్లా శర్మాస్‌వలి ,పట్టణ కార్యదర్శి బి అనుమేష్ ,ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షుడు షఫీ, ఇన్సాఫ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కె జిలాన్, తారక రామ్ నగర్ శాఖ కార్యదర్శి పి హసేన్, కనేకల్ పట్టణ మైనార్టీ కార్యదర్శి నూర్ రిజ్వాన్ భాషా,ఎన్ ఎఫ్ఐడబ్ల్యు మండల అధ్యక్షురాలు పి హసీనా, సీనియర్ నాయకురాలు కేభాగ్యమ్మ, సిపిఐ కార్యకర్తలు ఇతరులు పాల్గొన్నారు.

## మీ కోసం కాల్ సెంటర్

# 1100 సేవలను వినియోగించుకోండి

**- సెప్టెంబర్ 01వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ**
**- జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**
**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి**



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం, ఆగస్టు 30 :** మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగిం చుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసు కోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయ వచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

**సెప్టెంబర్ 01వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ :** సెప్టెంబర్ 01వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజే యాల న్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబం ధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపి స్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్‌గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



**గుంతకల్ -సూర్య వాస్తవం, ఆగస్టు 30:** స్థానిక పిఎన్టి కాలనీలో గల శ్రీ చైతన్య పాఠశాల గుంతకల్లు -2 నందు తెలుగు భాషా దినోత్సవాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం శ్రీ చైతన్య పాఠశాలల ఏ.జి.యం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. నేటి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గంగరాజు తెలుగు పండితులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వ్యవహారిక భాషా పితామహుడైన శ్రీ గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి రోజు అయిన ఆగస్టు 29న ప్రపంచ తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామని, గ్రాంధికంలో ఉన్న తెలుగును వ్యవహారిక భాషలో ఉండాలని ఉద్యమం చేసి పాఠశాల స్థాయి నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు బోధన భాషగా తెలుగు అమలుకు కృషి చేశారని చెప్పారు. కోఆర్డినేటర్ నాగభూషణం మాట్లాడుతూ మనదేశంలో తెలుగు మాట్లాడేవారు దేశమంతా ఉన్నారని గుర్తు చేశారు. “దేశభాషలందు తెలుగు లెస్స” అని కీర్తించిన శ్రీకృష్ణ దేవరాయల ఔన్నత్యాన్ని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ప్రిన్సిపాల్ పురుషోత్తం మాట్లాడుతూ “ఇటాలియన్ అఫ్ ది ఈస్ట్ “గా విదేశీయులు సైతం మన భాషను కొనియాడారని చెప్పారు. తేనెకన్న మధురమైన తెలుగు భాష ను విద్యార్థులు చక్కగా అభ్యసించాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ మస్తాన్ రావు, ఇంచార్జ్ ఖాదర్, ప్రైమరీ హై స్కూల్ తెలుగు ఉపాధ్యాయులు, ప్రైమరీ ఇంచార్జ్ హైమావతి, ఉపాధ్యాయిని, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.



## పల్లె ఉమాకు ఘనంగా నివాళులు అర్పించిన

# శ్రీ సాయి డిగ్రీ కళాశాల సిబ్బంది





**గుత్తి -సూర్య వాస్తవం, ఆగస్టు 30:** గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సాయి క్యాంపస్లో సీఈఓ శ్రీ రాములు, శ్రీ సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు రెడ్డి, పిఆర్ఆర్ ఎంబిఎ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసన్నకుమార్ ఆ ధ్వర్యంలో ఎస్ బి ఈ ఎస్ (శ్రీ బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ) మాజీ కరెస్పాండెంట్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సతీమణి పల్లె ఉమా ఏడవ వర్ధంతి కళాశాల నం దు నిర్వహించడం జరిగింది.అ నంతరం గుత్తి పట్టణంలో ప్రభు త్వ హాస్పిటల్ నందు గుత్తి ఆసు పత్రి సూపర్డెంట్ డాక్టర్ ఎల్లప్ప చే తులు మీదుగా రోగులకు బ్రెడ్డు పండ్లు ఇవ్వడం జరిగినది.ఘనంగా నివాళులర్పించడం జరిగినది ఈ సందర్భంగా శ్రీ సాయి క్యాంప స్ సీఈవో శ్రీరాములు మాట్లాడు తూ అనంతపురం జిల్లాలో అనేక విద్యాలయాలు స్థాపించి విద్యా ర్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఎంతో కృషి చేశారని అటువంటి వారు మన మధ్య లేకపోవడం బాధాక రమని విద్యార్థులు బాగా చదివి పల్లె ఉమా ఆశలను నెరవేర్చాల ని పిలుపునివ్వడం జరిగింది.అ దేవిధంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వెంక టేశ్వర్లు రెడ్డి మాట్లాడుతూ పల్లె ఉమాని స్ఫూర్తిగా తీసుకోవాలని ఇప్పుడున్న సమాజంలో బలమైన ఆయుధం విద్యనని బాగా చ దువుకొని ఉన్నత శిఖరాలను చే రుకోవాలని పిలుపు నివ్వడం జరి గింది.అదే విధంగా డాక్టర్ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ... పల్లె ఉమా ప్రతి ఒక్క హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నా రని స మాజానికి ఆమె ఎంతో సేవ చే సిందని స్ఫూర్తిగా తీసుకొని ముం దుకెళ్లాలని పిలుపునివ్వడం జరి గింది.ఈ కార్యక్రమంలో శ్రీ సాయి డిగ్రీ కళాశాల, పిఆర్ఆర్ ఎంబీఏ కళాశాల అధ్యాపక ,అధ్యాపకేతర బృందం, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# గణేషుని లడ్డూకు ఊహించని ధర



**మదనపల్లె -సూర్య వాస్తవం, ఆగస్టు 30:** మదనపల్లె మండలంలోని ఓ మారుమూల ప్రాంతంలో గణేషుని లడ్డూకి ఊహించని ధర లభించింది. ఎన్నడూ లేనంతగా భక్తులు గణేష్ ని లడ్డూకు వేలంలో పోటీ పడడంతో రూ.1.65 లక్షల ధర పలికింది. మదనపల్లె మండలం, మలేపాడు పంచాయతీలో దొనబైలు ఒక మారు మూల ప్రాంతం. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని గ్రామస్తులు వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించుకుని, ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. శనివారం గణేషుని నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసిన గణేశుని లడ్డూ వేలం పాటకు ఊహించని రీతిలో పోటీ పెరిగింది. ఈ పోటీలో గ్రామానికి చెందిన ముడి శివశంకర్ రూ.1.65 లక్షలకు లడ్డూ ను దక్కించు కున్నాడు. ఈ సందర్భంగా దొనబైలు గ్రామప్రజలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూట్యూబ్ యువ నటుడు భూషణ్, జ్యోతి, టిడిపి బీసీ జనరల్ సెక్రెటరీ రెడ్డిశేఖర్ నాయుడు. కాశి శ్రీరామ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తండ్రీ కుమారులపై దాడి



**మదనపల్లె -సూర్య వాస్తవం, ఆగస్టు 30:** తండ్రి కుమారుడి పై ప్రత్యర్థులు దాడి చేసి గాయపర్చారు. ఈ సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. బాధితులు తాలూకా పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు.. పట్టణంలోని కురువంకకు చెందిన శ్రీనివాసులు సమీపంలోని రామిరెడ్డిగారిపల్లె వద్ద స్థానిక రైతుకు చెందిన భూమిని కౌలు కు తీసుకున్నాడు. అందులో రేకుల షెడ్డు నిర్మించుకుని పాడి ఆవులను పెంచుకుంటూ పాల వ్యాపారం తో జీవనం సాగిస్తున్నాడు. ఇంటర్ చదువుతున్న చింటూ తండ్రితో పొలానికి వెళ్లి పాలు పితికి డైరీకి తీసుకెళ్తుండగా, స్థానికంగా ఉన్న శంకర్ రెడ్డి మరికొందరు వచ్చి మాకు తెలియకుండా ఆవుల షెడ్డు ఎందుకు వేసావని నిలదీసి, గొడవకు దిగారు. వెంటనే షెడ్డును ఖాళీ చేయాలని వార్నింగ్ ఇచ్చారు. చేయకపోతే చంపేస్తామంటూ బెదిరించారు. దీంతో తిరగబడ్డ తండ్రి కొడుకుపై దాడి చేసి చితకబాదారు. స్థానికులు అడ్డుకుని గాయపడిన బాధితులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు విచారిస్తున్నారు.

# పామిడిలో 8 మంది మట్కా బీటర్లు అరెస్ట్






**పామిడి -సూర్య వాస్తవం,ఆగస్టు 30:**పామిడి పట్టణానికి చెందిన 8 మంది మట్కా బిటర్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 1,13,900 నగదు, మట్కా చీటీలు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ యుగేందర్ తెలిపారు. శనివారం నాడు ఆయన తెలిపిన వివరాల మేరకు.. పామిడి పట్టణంలోనీ స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో 8 మంది వ్యక్తులు మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో తన సిబ్బందితో కలిసి దాడిచేయగా వారు మట్కా నిర్వ హిస్తుండగా వారిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసినట్లు సిఐ తెలిపారు.

# పోలీసు నిబంధనలు పాటిస్తూ వినాయక నిమజ్జనంలో పాల్గొనండి

**- ఎక్కడా అవాంఛనీయ ఘటనలు, అపశృతులు లేకుండా చూసుకోవాలి**
**- అనంతపురం నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే దగ్గుపాటి సూచన**
**- తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులకు ఎమ్మెల్యే ఆదేశం**



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, ఆగస్టు 30:** పోలీసు నిబంధనలు పాటిస్తూ వినాయక నిమజ్జనంలో పాల్గొనాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. ఆదివారం నగరంలో వినాయక నిమజ్జనం జరుగుతున్న నేపథ్యంలో మండపాల నిర్వాహకులకు, ప్రజలకు పలు అంశాలపై విజ్ఞప్తి చేశారు. నగరంలో జరిగే శోభాయాత్రను ప్రజలంతా వీక్షించే విధంగా పోలీసులు తగిన ఏర్పాట్లు చేశారన్నారు. మండపాల నిర్వాహకులు కచ్చితంగా పోలీసులు నిబంధనలు పాటించాలన్నారు. పోలీసులు, ఇతర అధికారులు నిర్ణయించిన విధంగా రాచానపల్లి, పంపనూరు సమీపంలో విగ్రహాలను నిమజ్జనం చేయాలన్నారు. ఊరేగింపులో ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా నిర్వాహకులు చూసుకోవాలన్నారు. డీజేలు ఇతర వాటి విషయంలో పోలీసులు సూచనలు పాటించాలన్నారు. నిమజ్జనం సమయంలో కాలువ వద్ద పిల్లలు, వృద్ధులు లేకుండా చేసుకోవాలన్నారు. అలాగే పోలీసులు సూచించిన సమయంలోనే నిమజ్జనం పూర్తి చేయాలన్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలకు, అపశృతులకు పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలని.. అలాగే ప్రజలు కూడా ఇందుకు సహకరించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

# పోలీసు నిఘా నీడలో పత్తికొండ గణేష్ నిమజ్జనం

**- నిమజ్జనం సజావుగా జరిగేలా సీఐ చర్యలు**
**- హర్షం వ్యక్తం చేసిన పత్తికొండ ప్రజలు**







**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం, ఆగస్టు 30:** పత్తికొండలో శుక్రవారం నాడు వినాయకుడి నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది. నిమజ్జనం సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నరు సీఐ జయన్న.జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ పర్యవేక్షణలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి నిమజ్జనం సజావుగా జరిగేం దుకు ప్రజలతో, వినాయక నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ, అవసరమైన సూచనలు అందించారు. ఈ చర్యల వల్ల పత్తికొండ వినాయక నిమజ్జనోత్సవాలు ఎటువంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా ముగిశాయి. గణేష్ శోభాయాత్ర ,నిమజ్జనం సురక్షితంగా ప్రశాంతంగా ముగిసేలా చూసిన పత్తికొండ సీఐ ,పోలీస్ అధికారులకు, సిబ్బంది కి పత్తికొండ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

### బీవీఎం స్పోర్ట్స్ ప్రీమియర్ లీగ్ సీజన్-1

# విజేత కరణం చిక్కప్ప పాఠశాల



**కళ్యాణదుర్గం - సూర్య వాస్తవం, ఆగస్టు 30:**గ్రామీణ ప్రాంతాల్లోనీ విద్యార్థులలో క్రీడలపట్ల అవగాహన కల్పిస్తూ విద్యార్థులలో క్రీడస్ఫూర్తి పెంచడానికి బి వి ఎం స్పోర్ట్స్ రవి బ్రహ్మ ఈ అండర్ 16 టోర్నమెంట్ నిర్వహించారు.నియోజకవర్గ వ్యాప్తంగా 16 జట్లు నమోదు చేసుకున్నాయి..ఫైనల్ లో తలపడిన జ్ఞానభారతి పాఠశాల మరియు కరణం చిక్కప్ప పాఠశాల.కరణం చిక్కప్ప పాఠశాల గెలుపు. విన్నర్ కి ట్రోఫీ తో పాటు 20వేల రూపాయలు ప్రైజ్ మనీ రన్నర్స్ కి ట్రోఫీతో పాటు10 వేల రూపాయలు ప్రైజ్ మనీ అందచేశారు. ఈ కార్యక్రమంలో బి వి ఎం స్పోర్ట్స్ రవి బ్రహ్మ మాట్లాడుతూ... మున్ముందు క్రికెట్ టోర్నమెంట్‌తో పాటు వాలీబాల్, బాట్మీటన్ టోర్నమెంట్స్ నిర్వహిస్తాం అని తెలిపారు.. అడిగిన వెంటనే గ్రౌండ్ కేటాయించిన జ్ఞానభారతి పాఠశాల అధినేత రమేష్ బాబుకి కృతజ్ఞతలు తెలియజేశారు .ట్రోఫీస్ స్పాన్సర్ చేసిన యూనియన్ బ్యాంక్ ఉద్యోగి లోకేష్ కి ప్రైజ్ మనీ స్పాన్సర్ చేసిన బద్దె నాయక్‌కి,సూర్య టైల్స్ యజమాన్యం సురేష్‌కి టోర్నమెంట్ విజయ వంతంగా జరగడానికి సహకరించిన పెద్దలకి,వివిధ పాఠశాల యాజ మాన్యానికి, వ్యాయామ ఉపాధ్యాయులకు, విద్యార్థి తల్లితండ్రులకు ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

**- అధికారులు సమన్వయంతో పనిచేయాలి**
**- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, ఆగస్టు 30:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సెప్టెంబర్ 1న రాజంపేట మండలం బోయనపల్లి గ్రామంలో పాల్గొన నున్న పర్యటనను విజయవంతం చేయడానికి అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశించారు. శనివారం కలెక్టర్, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, సబ్ కలెక్టర్ భావన, అదనపు ఎస్పీ మనోజ్ రెడ్డి లతో కలిసి హెలిప్యాడ్, దోబీ ఘాట్, పింఛన్ లబ్ధిదారుల ఇండ్లు, ప్రజా వేదిక ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికాబద్ధంగా అప్పగించిన బాధ్యతలను పూర్తి చేసి విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. బోయనపల్లి గ్రామ సమీపం లో సిద్ధం చేసిన హెలిప్యాడ్ మైదానంలో చుట్టూ బ్యారి కేడింగ్ పనులు పూర్తి చేసి, వాటర్ స్ప్రింక్లింగ్ నిర్వహించాల్సిందిగా ఆర్ అండ్ బి, అగ్నిమాపక శాఖ అధికారులను ఆదేశించారు. కాన్వాయ్ వెంట సక్రమ స్థితిలో వాహనాలను ఏర్పాటు చేయాలని రవాణా అధికారులకు సూచించారు. హెలిప్యాడ్ సమీపంలో మెడికల్ క్యాంప్, అంబులెన్స్, కార్డియాలజిస్ట్‌తో పాటు నైపుణ్యం గల వైద్యులను సిద్ధంగా ఉంచాలని డీఎం - హెచ్ఓ, డిసిహెచ్ఎస్ మరియు సంబంధిత వైద్యాధి కారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు ప్రోటోకాల్ ప్రకారం ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని కలెక్టర్ తెలిపారు.అనంతరం ధోబిఘాట్ ను పరిశీలించి ముఖ్యమంత్రి ముఖాముఖి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ పంపిణీ చేసే లబ్ధిదారుల వివరాలను కూడా కలెక్టర్ పరిశీలిస్తూ అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని డిపిఓను ఆదేశించగా, విద్యుత్ సరఫరా నిరంతరంగా అందించేందుకు ఏపీఎస్పిడిసిఎల్ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ప్రజావేదికను పరిశీలిస్తూ అధికారులకు తగు సూచనలు జారీ చేశారు.ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేస్తున్నామని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడుతున్నామని ఆయన వివరించారు.





### 11 ఓపెన్ బార్లు,

# ఒక రిజర్వ్‌డ్ బార్ లాటరీ ద్వారా కేటాయింపు

**- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**





**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, ఆగస్టు 30:** ప్రభుత్వం నూతనంగా అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 11 ఓపెన్ బార్లకు, ఒక రిజర్వ్‌డ్ బార్‌కు లాటరీ ద్వారా కేటా యింపు జరిపినట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో బార్ల కేటాయింపు లాటరీ డ్రా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ, మదనపల్లి డివిజన్‌లో మూడు బార్లు, రాయ చోటిలో రెండు బార్లు, రాజంపేటలో రెండు బార్లు మరియు కల్లుగీత కార్మికులకు ఒక రిజర్వ్‌డ్ బార్ సహా మొత్తం 11 ఓపెన్ బార్లకు, ఒక రిజర్వ్‌డ్ బార్‌కు లాటరీ ద్వారా కేటాయిం చామని వివరించారు. మదనపల్లిలో అంగజాల రాజన్న, బి. మనోహర్, బండారు నాగ రాజులు, రాయచోటిలో దొండ్ల హర్ష వర్ధన్, పేరం ఇరగంరెడ్డి, రాజంపేటలో కె. సురేష్ కుమార్ నాయుడు, కె. సుబ్బయ్యలు, అలాగే కల్లుగీత కార్మికులకు రిజర్వ్‌డ్ బార్ కేటాయింపులో బి. కొత్తకోట బార్‌ను కుడుము ఆదిత్యకు లాటరీ డ్రా ద్వారా కేటాయించామని కలెక్టర్ తెలిపారు. మిగిలిన నాలుగు బార్లకు తగినన్ని దరఖాస్తులు రాకపోవడంతో లాటరీ నిర్వహించలేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి జి. మధుసూదన్, ఏఈయస్ జోగేంద్ర, సీఐలు ఎల్లయ్య, గురుప్రసాద్, భీమలింగ, సుబ్బారెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, యల్‌డియమ్ తో పాటు దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

### నాటికి నేటికి మేటి

# మాయల మరాఠీ పుంజా కృష్ణారావు





**పామిడి- సూర్య వాస్తవం,ఆగస్టు 30:** పౌరాణిక నాటక రంగమే తన ఊపిరిగా ప్రాణముగా భావించి కళాకారునిగా జీవితాన్ని అర్పించిన పుంజా కృష్ణారావు యాదవ్ నాటికి నేటికి మేటి మాయల మరాఠీగా పేరు ప్రఖ్యాతలు పొందుతూనే ఉన్నారు. ఈయన అనంతపురం జిల్లా పామిడి మండలంలో సొరకాయలపేటగ్రామంలోని గొల్ల పుంజా గంగన్న, పుంజా గంగమ్మ దంపతులకు నాల్గవ కుమారునిగా 1960లో కృష్ణాష్టమి రోజున జన్మించాడు. 1983లో జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కాలేజీలో బిఎ చదువులు పూర్తి చేశారు. అదే సంవత్సరం తన స్వగ్రామంలో గయోపాఖ్యానం అను పౌరాణిక రంగస్థలం నాటకం శిక్షణ పొందుతుండగా చిలకించడానికి పోయి నందుకు బలరాముని పాత్రను కట్టిపెట్టారు. అప్పటినుండి కళా రంగంపై ఆకర్షవంతులై నిరుద్యోగస్తులై నిలిచి పోయారు. ఆనాటి నుండి దుర్యోధన, విశ్వా మిత్రుడు, వీర బాహుడు, మాయలమరాఠిగా పలు పాత్రలలో పౌరాణిక రంగస్థల వేదికలపై 1045 ప్రదర్శ నలలో తన నటనా చాతుర్యం కనపరి పండితులు పామ రులు ఆ బాల గోపాలములచే ప్రశంసలు అందుకుంటున్నారు. మాయల మరాఠీగా వేదికపై ఉరుములు లాంటి నవ్వులు,పిడుగులు లాంటి కేరింతలు, పళ్ళు కొరికే శబ్దాల హావభావాలతో అట్టహాసాలతో నడుస్తున్నంత సేపు ప్రేక్షకులు కేరింతలు విజిల్ చప్పట్లతో మారు మరుగు తాయి. ఈయన రాయలసీమ,ఆంధ్ర,కోస్తా ప్రాంతాలలోనే కాక కర్ణాటక ప్రాంతంలో కూడా నాటక ప్రదర్శనలు ఇచ్చాడు. సత్యసాయిబాబా 80వ జన్మది నోత్సవాల సందర్భంగా కృష్ణ కళామందిరంలో నిర్వ హించిన రాష్ట్రస్థాయి పౌరాణిక నాటక పోటీలలో బాల నాగమ్మ పూర్తినాటకంలో మాయలమరాఠీగా పూర్తిస్తాయిలో నటించి ప్రధమ స్థానంతో పాటు 25,000 నగదు బహుమతి పొందారు స్టేట్ ప్రైజ్ విన్నర్‌గా పేరొందినారు. అదే వేదికపై కలెక్టర్ రజిత్ భార్గవ్, మంత్రులు రఘువీరారెడ్డి, శైలజనాథ్ చేతులు మీదుగా ప్రశంసా పత్రాలు బహుమతులు అందుకున్నారు. లలిత కళాప రిషత్తులో ఉత్తమ నటుడిగా కలెక్టర్ గురుదాసు, జాయింట్ కలెక్టర్అనిత రామచంద్రన్, డిపిఆర్ఓ తిమ్మప్ప, ఎమ్మెల్యే గుర్నాథ్ రెడ్డి, సినీ యాక్టర్ హీరో నరేష్ తదితరుల చేతుల మీదుగా మినీ నంది అవార్డుతో పాటు సన్మానంపొందారు. ఇలాంటివి తను 42 సంవత్సరాల కళా జీవితంలో కొన్ని వందల సన్మానాలు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ప్రవృత్తి 30 సంవత్సరములుగా పత్రికా రంగంలో సీనియర్ పాత్రికేయునిగా కొనసాగుతున్నారు. ఇది అతని జీవిత ఘట్టం.

# చెన్నై. హైదరాబాద్..., బెంగళూరు ఇక 2 అవర్స్...

## - అమరావతి నుంచి కొత్త లైన్లు



**విజయవాడ–సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి, హైదరాబాద్ మధ్య బుల్లెట్ రైళ్లు పరుగులు తీయనున్నాయి. హైదరాబాద్– చెన్నై మధ్య హైస్పీడ్ ఎలివేటెడ్ రైలు కారిడార్ నిర్మాణానికి సంబంధించిన ఎలైన్ మెంట్‌కు ప్రాథమిక ఆమోదం లభించింది. ఈ కారిడార్ అమరావతిని చేరుకుంటూ, సీఆర్డీయే మీదుగా వెళ్తుంది. ఇదే విధంగా, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల మీదుగా వెళ్లే హైదరాబాద్– బెంగళూరు హైస్పీడ్ రైలు కారిడార్ ఎలైన్‌మెంట్‌కూ ప్రాథమిక ఆమోదం లభించింది. ఈ రెండు రైలు మార్గాల నిర్మాణంతో తెలుగు రాష్ట్రాల్లో ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది. మెట్రో నగరాల మధ్య బుల్లెట్ రైళ్లు నడిపేందుకు కేంద్ర ప్రభుత్వం హైస్పీడ్ ఎలివేటెడ్ కారిడార్లను నిర్మిస్తున్నది. ఈ ప్రాజెక్టులో భాగంగా, హైదరాబాద్–చెన్నై హైస్పీడ్ కారిడార్, హైదరాబాద్– బెంగళూరు కారిడార్లు ఏపీ మీదుగా వెళ్తాయి. ఈ రెండు కారిడార్లు ప్రారంభంలో హైదరాబాద్ నుంచి శంషాబాద్ వరకు 38.5 కిలోమీటర్ల వరకూ ఒకే మార్గంలో వెళ్తాయి. అనంతరం, చెన్నై, బెంగళూరు వైపుగా విడిపోయే వేర్వేరు మార్గాలుగా సాగుతాయి. హైదరాబాద్– చెన్నై హైస్పీడ్ కారిడార్ కోసం 839.5 కి.మీ, 749.5 కి.మీ, 744.57 కి.మీలతో 3 ప్రతిపాదిత మార్గాలను పరిశీలించారు. వీటిలో అతి తక్కువ దూరమైన 744.5 కి.మీ. మార్గాన్ని ఎలైన్‌మెంట్‌కు ప్రాథమికంగా ఖరారు చేశారు. ఈ కారిడార్‌లో తెలంగాణలో 6, ఆంధ్రప్రదేశ్‌లో 8, తమిళ నాడులో 1 స్టేషన్ నిర్మించనున్నారు. ఏపీలో ప్రతిపాదిత స్టేషన్లు అమరావతి, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, నాయుడుపేట, తడ ఉన్నాయి. ఈ మార్గం హైదరా బాద్‌లో ప్రారంభమై అటు నుంచి శంషాబాద్, నార్కట్‌పల్లి, సూర్యాపేట, ఖమ్మం/కోదాడ మీదుగా అఖీఆం ప్రాంతానికి చేరుకుని, అక్కడి నుంచి గుంటూరు వైపు సాగుతుంది. గుంటూరు తర్వాత చీరాల వైపు వెళ్తూ, విజయవాడ – చెన్నై రైల్వే లైన్‌కు సమాంతరంగా చెన్నై వరకు వెళ్లేలా కారిడార్ నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టులో అత్యధికంగా ఏపీలో 448.11 కి.మీ, తరువాత తెలంగాణలో 236.48 కి.మీ, తమిళనాడులో 59.98 కి.మీ మేర రైలు మార్గం ఉండనుంది. ఈ కారిడార్‌ను తిరుపతి మీదుగా మళ్లిస్తే ప్రయాణికులకు మరింత సౌలభ్యం కలుగుతుందని ప్రాథమికంగా చర్చ జరిగింది. గూడూరు నుంచి తిరుపతి మీదుగా మారిస్తే, కారిడార్ పొడవు అదనంగా 53.5 కి.మీ దూరం పెరుగుతుంది. ఈ మార్పుతో నాయుడుపేట, తడ స్టేషన్లు మార్గంలో ఉండకపోవచ్చు. మొత్తం హైస్పీడ్ ట్రాక్ నిర్మాణంలో డబుల్ ట్రాక్, లూప్‌లైన్లు, సైడింగ్స్ కలిపి మొత్తం 1,419.4 కి.మీ వరకు ట్రాక్ నిర్మించాల్సి ఉంటుంది. హైదరాబాద్– బెంగళూరు హైస్పీడ్ కారిడార్‌కు సంబంధించి మూడు ప్రతిపాదిత మార్గాలు 621.8 కి.మీ, 576.6 కి.మీ, 558.2 కి.మీలను పరిశీలించారు. వీటిలో 576.6 కి.మీ మార్గం అత్యుత్తమంగా భావించి ఎలైన్‌మెంట్‌కు ప్రాథమికంగా ఆమోదం లభించింది. ఈ మార్గం ప్రస్తుత హైదరాబాద్– బెంగళూరు హైవేకి చాలావరకు సమాం తరంగా ఉంటుంది. ఈ కారిడార్‌లో తెలంగాణలో 4, ఆంధ్రప్రదేశ్‌లో 6, కర్ణాటకలో 3 స్టేషన్లు నిర్మించనున్నారు. ఏపీలో ప్రతిపాదిత స్టేషన్లు కర్నూలు, డోన్, గుత్తి, అనంతపురం, దుద్దేబండ, హిందూపురం ఉన్నాయి. ఈ మార్గంలో తెలంగాణలో 218.5 కి.మీ, ఏపీలో 263.3 కి.మీ, కర్ణాటకలో 94.80 కి.మీ మేర రైలు మార్గం ఉంటుంది. డబుల్ లైన్, లూప్‌లైన్లు, సైడింగ్స్ కలిపి మొత్తం 1,363 కి.మీ మేర ట్రాక్ నిర్మించనున్నట్లు ఎలైన్‌మెంట్‌లో పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని పెనుకొండ సమీపంలో ఉన్న కియా పరిశ్రమ, అనుబంధ పరిశ్రమల నేపథ్యంలో దుద్దేబండ వద్ద ప్రత్యేకంగా స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదన ఉంది.

హైదరాబాద్– అమరావతి– చెన్నై హై స్పీడ్ రైలు కారిడార్, హైదరాబాద్– బెంగళూరు మధ్య బుల్లెట్ రైళ్ల కారిడార్లు పూర్తవడంతో పాటు బెంగళూరు– చెన్నై మధ్య చేపట్టే బుల్లెట్ రైలు కనుక అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి అమరావతికి.. అమరావతి నుంచి చెన్నై, బెంగళూరు నగరాల మధ్య బుల్లెట్ రైళ్ల చతుర్భుజి ఏర్పాటు అవుతుంది. తద్వారా ఈ నగరాల మధ్య ప్రయాణం గంట నుంచి రెండు గంటల్లోనే పూర్తవుతుంది.

## వివేకా హత్య కేసు, సుగాలి ప్రీతి...

# కేసులను ఛేధించడం ఎలా



**విజయవాడ–సూర్య వాస్తవం:** ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా వాటికి ప్రాణం వచ్చినట్లు అయ్యింది. ముఖ్యంగా అమరావతికి ఊపిరి పోసింది కూటమి ప్రభుత్వం. అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రారంభించగలిగింది. అయితే రాష్ట్రంలో సంచలనంగా మారిన వివేకానంద రెడ్డి హత్య కేసు, సుగాలి ప్రీతి హత్య కేసులు కూడా త్వరగా ఛేదించి నిందితులకు శిక్షపడేలా కూటమి ప్రభుత్వం చేస్తుందన్న నమ్మకం కలిగింది. కానీ ఏడాదిన్నర అవుతున్న ఈ రెండు కేసులు కనీస స్థాయిలో కూడా ముందుకు కదలకపోవడం ఇబ్బందికరంగా మారింది. ఈ రెండు కేసులను వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగార్చిందన్న ఆరోపణలు, అనుమానాలు ఉన్నాయి. కానీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి వీటినే లేవనెత్తింది. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ రెండు కేసులను తేల్చేస్తామని ప్రకటనలు చేశారు. అందుకే టిడిపి మెడకు వివేకానంద రెడ్డి హత్య కేసు.. జనసేన మేడకు సుగాలి ప్రీతి కేసు చుట్టుకున్నాయి. వాటిని తేల్చకపోతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు ఆ రెండు పార్టీలు మూల్యం చెల్లించుకోవడం తప్పదువైయస్ వివేకానంద రెడ్డి హత్య కేసు సంచలనంగా మారింది. గుండెపోటు, నారా సుర రక్త చరిత్ర, సిబిఐ అంటూ రకరకాలుగా వైసిపి దారులు మళ్లించింది. కానీ ఆ గొడ్డలి వేటు రక్తపు మరకలు మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు చూపించాయి. ఈ హత్య ఆరోపణలన్నీ వైఎస్ కుటుంబ సభ్యులు చుట్టే తిరిగాయి. అవినాష్ రెడ్డి నేరస్తుడు అంటూ వివేక కుమార్తె సునీత, జగన్ సోదరి షర్మిల టార్గెట్ చేశారు. అందుకు తగ్గ ప్రాథమిక ఆధారాలను కూడా బయటపెట్టారు. అయినా సరే వైసీపీ హయాంలో కేసు విచారణ అడుగు ముందుకు పడలేదు. అవినాష్ రెడ్డి చుట్టూ జగన్ వలయంగా ఏర్పడి కాపాడగలిగారు అన్నది బహిరంగ రహస్యం. వివేకా కేసులో సునీతకు న్యాయం జరగాలి.. హూ కిల్డ్ బాబాయ్ అన్న ప్రశ్నకు జవాబు చెప్పాలి అంటూ గత ఐదేళ్లలో తెలుగుదేశం పార్టీ భారీ స్లోగన్ ఇచ్చింది. జగన్మోహన్ రెడ్డితో పాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు ఎక్కు పెట్టింది. దోషులకు కొమ్ముకాస్తున్నారంటూ జగన్ పై నేరుగా టిడిపి కార్యకర్తల నుంచి నేతల వరకు విమర్శలు చేస్తూనే వచ్చారు. కానీ కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర సమీపిస్తుంది. ఇంకా



వివేకా కేసు విషయంలో అసలు వాస్తవాలు బయటకు రావడం లేదు. సునీత ఆరోపిస్తున్న వ్యక్తులు ధైర్యంగా తిరగ గలుగుతున్నారు. వివేకా కుమార్తె సునీత పోరాటానికి ఫలితం దక్కలేదు. కానీ వైసీపీ హయాంలో సునీతతో పాటు ఆమె భర్తపై పెట్టిన కేసులను మాత్రం కోర్టు కొట్టి వేయడం ఉపశమనం. అంతకుమించి ఈ కేసు ముందుకు సాగలేదు. అధికారుల సైతం ఈ కేసు విచారణ పూర్తయిందని కోర్టుకు నివేదించారు. ఈ మొత్తం ఎపిసోడ్లో ఇంకా గందరగోళం నడుస్తోంది. ఇదిలా ఉంటే సుగాలి ప్రీతికేసు జనసేన మేడకు చుట్టుకుంది.

14 సంవత్సరాల గిరిజన బాలికను దారుణంగా హత్య చేశారు. చేయకూడని పని చేసి మట్టుపెట్టారు. ఈ కేసు ఏపీలో సంచలనంగా మారింది. అయితే ఈ కేసు మూలాలను, సాక్షాలను వైసిపి ప్రభుత్వం తుడిచేసింది అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు పవన్ కళ్యాణ్. సుగాలి ప్రీతి హత్యకు గాను ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని.. వారి పోరాటాలకు ఫలితం దక్కాలి అంటూ నాడు వైసిపి ప్రభుత్వ హయాంలో పవన్ హీరో చిత పోరాటం చేశారు. దీంతో ఈ కేసు బాధ్యత జనసేనపై పడింది. కూటమిలో కీలక భాగస్వామిగా ఉండడంతో ఇప్పుడు పవన్ ఈ కేసును తేల్చాల్సి వస్తోంది. సుగాలి తల్లి నేరుగా పవన్ పై ఇప్పుడు విమర్శలు చేయడంతో ఆయన స్పందించాల్సి వచ్చింది. జనసేన పోరాట ఫలితం మూలంగానే ఆ కుటుంబానికి న్యాయం జరిగిందని.. కానీ సుగాలి ప్రీతి కేసు లో నిందితులకు శిక్ష పడితేనే అసలు న్యాయం జరిగినట్టని పవన్ కళ్యాణ్ చెప్పారు. అయితే ఈ రెండు కేసులను టిడిపి కూటమి తేలిగ్గా తీసుకుంటే మాత్రం ఇబ్బందికరమే. ఈ రెండు కేసులలో అసలు దోషులు ఎవరు? అనేది నిరూపించ లేకపోతే టిడిపి కూటమికి ఇబ్బందికరమే. నిరూపించగలిగితే మాత్రం వైసీపీ అరాచకానికి ఫుల్ స్టాప్ పెట్టిన వాళ్ళు అవుతారు.

## శ్రీధర్ రెడ్డి హత్యకు కుట్ర..



**నెల్లూరు,–సూర్య వాస్తవం:** నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హత్యకు రౌడీషీటర్లు ప్లాన్ చేసిన విషయం బయటపడింది. రౌడీషీటర్ శ్రీకాంత్‌కు ప్రధాన అనుచరుడైన జగదీష్ అనే వ్యక్తి సహచర మిత్రులతో మాట్లాడుతున్న వీడియో వైరల్ గా మారింది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేను చంపేస్తే డబ్బే డబ్బు అంటూ వారు మద్యం మత్తులో మాట్లాడుకుంటున్న వీడియో వైరల్ అయింది. దీంతో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హత్యకు కుట్ర జరిగినట్లు తేలిందని పోలీసులు భావిస్తున్నారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల రౌడీషీటర్ శ్రీకాంత్ కు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పెరోల్ కు సంబంధించి సిఫార్సు కూడా చేసిన సంగతి తెలిసిందే. అయితే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని చంపించాలనుకుంటున్నదెవరు? వారికి డబ్బులు ఇస్తామన్నది ఎవరు? అన్నది పోలీసుల విచారణలో తేలనుంది. అయితే కోటంరెడ్డి అనుచరులు మాత్రం తమ ఎమ్మెల్యే ను హత్య చేయడానికి వైసీపీ ముఖ్యనేత ఒకరు ప్లాన్ చేశారని చెబుతున్నారు. శ్రీధర్ రెడ్డిని హత్యచేస్తే డబ్బే డబ్బు అంటూ మద్యం మత్తులో మాట్లాడిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. అయితే ఆ వీడియోలో ఎవరి పేర్లు వినిపించలేదు. దీనిపై కోటంరెడ్డి అనుచరులు మాత్రం వీరి వెనక వైసీపీ నేతలు ఉన్నారని చెబుతుండటంతో సింహపురి రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఈ వీడియోపై కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కూడా స్పందించారు. ఈ వీడియో విషయం తన దృష్టికి వచ్చిందని, అయితే తనను చంపేందుకు వైసీపీ నేతలు కొందరు కుట్ర చేశారన్న అనుమానాలు కలుగుతున్నాయని ఆయన మీడియాతో చెప్పారు. దీనిపై నెల్లూరు జిల్లా ఎస్పీకూడా స్పందించారు. తాము కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ వీడియోను చూశామని, రౌడీ షీటర్ శ్రీకాంత్ అనుచరుడు జగదీష్ ఈ వ్యాఖ్యలు చేయడం వెనక ఎవరున్నారన్న దానిపై తాము దర్యాప్తు చేస్తామని చెబుతున్నారు. నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షిస్తామని చెప్పారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి హత్యకు కుట్ర చేసిందెవరు? వారి ప్లాన్ వెనక ఉన్నదెవరు? అన్నదానిపై దర్యాప్తు చేస్తామని అంటున్నారు. మద్యం మత్తులో హత్య ప్రణాళికపై చర్చించిన జగదీష్, మహేష్, వినీత్ లను పట్టుకుంటే తప్ప అసలు విషయాలు తెలియవు. ఆయన కోరితే భద్రత కల్పిస్తామని చెప్పారు.

## పిన్నెల్లి బ్రదర్స్‌కు వరుస కష్టాలు

**గుంటూరు–సూర్య వాస్తవం:** వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మరోసారి జైలుకు వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆయన ముందస్తు బెయిల్ పిటీషన్ ను హైకోర్టు కొట్టివేసింది. హైకోర్టులో పిన్నెల్లి సోదరులకు ఎదురుదెబ్బ తగలడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించేందుకు పల్నాడు పోలీసులు సిద్ధమయ్యారు. పల్నాడు జిల్లాలో జరిగిన జంట హత్య కేసుల్లో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి ఇద్దరూ నిందితులుగా ఉన్నారు. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలానికి చెందిన టీడీపీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావుల హత్య కేసులో వీరిద్దరూ ఏ6, ఏ7 నిందితులుగా పోలీసులు గతంలో కేసు నమోదు చేశారు. అయితే రాజకీయ కక్ష సాధింపు తోనే తమపై అక్రమ కేసులు బనాయించారని కోరుతూ హైకోర్టును ఆశ్రయించడంతో వారికి ముందస్తు బెయిల్ లభించింది. గతంలో ఎన్నికల సందర్భంగా ఈవీఎం బాక్సులను ధ్వంసం చేయడంతో పాటు పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు అధికారిపై దాడికి యత్నించిన కేసులో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నెల్లూరు జిల్లా జైలులో కొన్ని నెలల పాటు ఉండి శిక్ష అనుభవించి బెయిల్ పై బయటకు వచ్చారు. అయితే ఆ తర్వాత పల్నాడు జిల్లాలో జరిగిన జంట హత్య కేసులో కూడా వీరిని నిందితులుగా చేర్చడంతో ముందస్తు బెయిల్ ను హైకోర్టు నుంచి తెచ్చుకున్నారు. అయితే ఈరోజు పిన్నెల్లి సోదరుల ముందస్తు బెయిల్ ను హైకోర్టు కొట్టివేసింది. పల్నాడు జిల్లాలో జంట హత్య కేసులో పిన్నెల్లి సోదరుల కుట్ర ఉందని ప్రభుత్వం తరుపున న్యాయవాదులు వాదించారు. వీరు ఒక రెస్టారెంట్ లో సమావేశమై హత్యకు కుట్రపన్నారని, ఫోన్ లో కూడా మాట్లాడారని, టెక్నికల్ ఎవిడెన్స్ కూడా ఉందని న్యాయస్థానానికి న్యాయవాదులు చెప్పారు. వాస్తవాలు బయటకు రావాలంటే పిన్నెల్లి సోదరులను అదుపులోకి తీసుకుని విచారిస్తే తప్ప వెల్లడి కావని వాదించారు. వారిద్దరిపై రౌడీషీట్ కూడా ఉందని, గతంలో నేర చరిత్ర కూడా ఉందని చెప్పడంతో హైకోర్టు ముందస్తు బెయిల్ ను కొట్టివేసింది.

## అల్లు అరవింద్ ఇంట విషాదం



**హైదరాబాద్–సూర్య వాస్తవం:** తెలుగు సినిమా ఇండస్ట్రీలో స్టార్ హీరోగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్న నటుడు అల్లు అర్జున్? ఆయన చేసిన ప్రతి సినిమాలో ఏదో ఒక వైవిధ్యమైన కథాంశం అయితే ఉంటుంది? ఇక తను ఇంతకుముందు చేసిన 'పుష్ప 2' సినిమాతో 1850 కోట్లకు పైన కలెక్షన్లు రాబట్టి యావత్ ఇండియన్ సినిమా ఇండస్ట్రీ మొత్తాన్ని తన వైపు తిప్పుకున్నాడు. మరి అలాంటి అల్లు అర్జున్ ఇప్పుడు చేస్తున్న సినిమాలతో మరింత ముందుకు దూసుకెళ్లాలనే ప్రయత్నం చేస్తున్నట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన నుంచి వచ్చే సినిమాలు అతని అభిమానులను అలరించడమే కాకుండా యావత్ ఇండియన్ సినిమా ప్రేక్షకులందరిని మెప్పించే ప్రయత్న అయితే చేస్తున్నాయి. కాబట్టి ఆయన చేసే సినిమాల మీద యావత్ ఇండియన్ సినిమా ప్రేక్షకులందరికి చాలా మంచి అంచనాలైతే ఉన్నాయి. ప్రస్తుతం అల్లు అర్జున్ అట్లీ డైరెక్షన్లో సినిమా చేస్తున్న విషయం మనకు తెలిసిందే. ఇక పాన్ వరల్డ్ లో ఈ సినిమా మీద అల్లు అర్జున్ భారీ ఆశలైతే పెట్టుకున్నాడుఇక ప్రస్తుతం అల్లు అర్జున్ వాళ్ళ నాన్నమ్మ, అల్లు అరవింద్ వాళ్ల అమ్మ, అల్లు రామలింగయ్య భార్య అయిన అల్లు కనకరత్నం గారు 94 సంవత్సరాల వయస్సు లో వృద్ధాప్య సమస్యలను ఎదుర్కొంటు గత కొన్ని రోజులుగా హాస్పిటల్ లోనే ఉంటున్నారు. ఆమె ఆరోగ్యం పూర్తిగా విషమించడంతో ఈరోజు ఉదయం ఆమె కన్నుమూశారు? ప్రస్తుతం అల్లు అర్జున్ ముంబై లో అట్లీ సినిమాకు సంబంధించిన వర్క్ షాప్ లో బిజి గా ఉన్నాడు? ఇక ఈ విషయం తెలిసిన వెంటనే ఆయన హుటాహుటిన హైదరాబాద్ కి బయలుదేరాడు. ఇక ఈరోజు మధ్యాహ్నం కోకాపేటలో ఆమె అంత్యక్రియలు నిర్వహించబోతున్నారు? ఇక అల్లు అరవింద్ అయితే తన తల్లిని కోల్పోయిన బాధతో తీవ్రమైనగ్లాని అంతికి గురవుతున్నట్టుగా తెలుస్తోంది? ఇక ఇప్పటికే అల్లు అరవింద్ దగ్గరికి పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు వచ్చి తమ సంతాపాన్ని తెలియజేస్తున్నారు?

# అభిమానుల ప్రేమ వల్లే ఈ రికార్డులు



నటసింహా నందమూరి బాలకృష్ణ సినీ పరిశ్రమలో నటుడిగా 50 ఏళు పూర్తి చేసుకోవడంతో ఆయన పేరు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కింది. భారతీయ చలన చిత్ర పరిశ్రమలో ఈ అరుదైన గౌరవానికి ఎంపికైన తొలి హీరో బాలకృష్ణ. శనివారం (ఆగస్ట్ 30) నాడు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో .. తెలంగాణ రాష్ట్రంలో వరదలకు అతలాకుతలం అయిన ప్రాంతాల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి యాభై లక్షల ఆర్థిక విరాళాన్ని బాలయ్య ప్రకటించారు. నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ–%––%నా గురువు, నా దైవం విశ్వ విఖ్యాత నట సార్వభౌమ, కళా ప్రపూర్ణ, నట రత్న, పద్మశ్రీ నందమూరి తారక రామారావు గారు, నా తల్లి బసవతారకం గారికి ధన్యవాదాలు. నేను ఇండస్ట్రీలో 50 ఏళ్ల సుదీర్ఘమైన ప్రయాణాన్ని పూర్తి చేశాను. నాకు ఈ లెక్కలన్నీ సరిగ్గా గుర్తుండవు. అంకెలన్నీ కూడా అభిమానులు గుర్తు పెట్టుకుంటారు. నా మనవళ్లు కూడా నన్ను బాలా అని పిలుస్తుంటారు. నటుడిగా మా నాన్న గారే నాకు స్ఫూర్తి. రాజకీయాల్లోకి రాక ముందే ప్రజా సేవా చేసేవారు. వరదల సమయంలో ముందుండి సాయం చేసేవారు. ప్రాంతాలు వేరైనా సరే విపత్కర పరిస్థితుల్లో ఆయన సేవా కార్యక్రమాలు చేశారు. అందరి సహాయ సహకారాలతో క్యాన్సర్ హాస్పిటల్‌ను నడిపిస్తున్నాను. సినిమా అనేది బలమైన మాధ్యమం. నా దర్శక, నిర్మాతల సహకారంతోనే ఈ స్థాయికి వచ్చాను. కళకి ఎప్పుడూ భాషా బేధం, లింగ బేధం ఉండదు. మన తెలుగు సినిమా ఇప్పుడు ఆస్కార్ స్థాయికి ఎదిగింది. ఇది మన తెలుగు వారంతా గర్వించదగ్గ విషయం. ఈ రోజు నాకు ఇలా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి గుర్తింపు రావడం ఆనందంగా ఉంది. నేను 13 ఏళ్ల వయసులోనే తాతమ్మ కల మూవీ చేశాను. గత ఐదు దశాబ్దాల్లో నేను ఎన్నో జానర్లలో, ఎన్నెన్నో పాత్రల్ని పోషించాను. ఆదిత్య 369 అనేది ఇండియాలో మొట్ట మొదటి సైఫై చిత్రం. 50 ఏళ్లలో 110 చిత్రాలు చేశాను.నేను మూడు సార్లు హిందూపురం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాను. బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా సేవలందిస్తున్నాను. ఇవన్నీ నేను ఒక్కడినే సాధించలేదు. ఈ ప్రయాణంలో నా దర్శక, నిర్మాతలు, కుటుంబ సభ్యులు, అభిమానులు అండగా నిలిచారు. నా భార్య వసుంధర ఈ ప్రయాణంలో నా వెన్నంటే నిల్చుని కుటుంబాన్ని చూసుకున్నారు. కేంద్రం నుంచి రీసెంట్‌గా పద్మ భూషణ్ అవార్డు లభించింది. భగవంత్ కేసరికి ఉత్తమ జాతీయ తెలుగు చిత్రంగా అవార్డు వచ్చింది. నేను చేసిన అన్ స్టాపబుల్ షో అరుదైన రికార్డులు సాధించింది. నాకు ఈ గుర్తింపు రావడం ఆనందంగా ఉంది. నాకు విషెస్ అందించిన అమితాబ్ గారికి, రజినీకాంత్ గారికి ధన్యవాదాలు. అభిమానుల ప్రేమ వల్లే ఈ విజయాల్ని, రికార్డుల్ని సాధించాను. ఇదే ఉత్సాహం, ప్యాషన్‌తో మున్ముందుకు సాగుతానని మాటిస్తున్నాను. ఈ జర్నీ ఇంకా కొనసాగుతూనే ఉంటుందిఅని అన్నారు. కేంద్ర హెూం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ కు, ఏపీ ఐటీ, ఎడ్యుకేషన్ మినిస్టర్ శ్రీ నారా లోకేష్ , సహజ నటి జయసుధ , వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ సీఈఓ సంతోష్ శుక్లా, జాయింట్ సెక్రటరీ ఓలా తదితరులకు బాలయ్య ధన్యవాదాలు తెలిపారు.

# హీరోయిన్ల పోస్టర్లు ఎందుకు పెట్టరు?





'దక్షిణాది సినిమా పోస్టర్‌లలో హీరోలే ఉంటారు కానీ హీరోయిన్‌లు కనిపించర'ని ఓ కార్యక్రమంలో జ్యోతిక మాట్లాడారు. ఒక సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఆమె, 'బాలీవుడ్ నటుడు అజయ్ దేవగన్, మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి తమ సినిమాలకు సంబంధించిన పోస్టర్లలో తన ఫోటోను ఉంచారని, కానీ దక్షిణాదిలో మాత్రం హీరోయిన్‌ల ఫోటోలను పోస్టర్లపై పెట్టడానికి ఆసక్తి చూపర'ని అన్నారు. తాను నటించిన 'శైతాన్' హిందీ సినిమా పోస్టర్‌ను అజయ్ దేవగన్ తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని, అలాగే మలయాళంలో మమ్ముట్టితో నటించిన 'కాథల్–ది కోర్' సినిమా పోస్టర్‌ను కూడా మమ్ముట్టి తన సోషల్ మీడియాలో పంచుకున్నారని జ్యోతిక గుర్తు చేశారు. దక్షిణాదిలో ఎంతోమంది స్టార్ హీరోలతో తాను పనిచేశానని ఏ ఒక్కరూ తమ సోషల్ మీడియాలో హీరోయిన్ల ఫోటోలను పోస్ట్ చేయడానికి ఆసక్తి చూపలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.



# ప్రో కబడ్డీ.. కబడ్డీ.. కొత్త కూత...



క్రికెట్‌లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)... బ్యాడ్మింటన్ లో బ్యాడ్మింటన్ ప్రీమియర్ లీగ్ (బీపీఎల్)... ఇలా ఫేమస్ గేమ్స్ కు ఇండియాలో ప్రత్యేకించి లీగ్ లు ఉన్నాయి...వీటికి ఆదరణ కూడా అంతే స్థాయిలో ఉంది..! ఇలాంటి నేపథ్యంలోనే పుట్టుకొచ్చింది ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్). భారత గ్రామీణ క్రీడ అయిన కబడ్డీకి దేశంలో ఇంత ఆదరణ ఉందా? అన్నట్లుగా... అప్పటిదాక ఎవరూ ఊహించని కూడా ఊహించని విధంగా క్లిక్ అయింది ప్రో కబడ్డీ లీగ్. 2014లో ప్రారంభమైన ఈ లీగ్ తొలి నాళ్లలో విపరీతమైన ఆదరణ చూరగొంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, ప్రజలు కబడ్డీ మ్యాచ్ లకు ఆకర్షితులయ్యారు. ఈ క్రమంలో వరుసగా సీజన్లు ముగిశాయి. పదేళ్ల తర్వాత చూస్తే..ఆదరణ తగ్గుతోందని తేలింది. తెలుగు వారు లేకనా? ప్రో కబడ్డీ లీగ్ సక్సెస్ స్థాయి ఏమిటో చెప్పాలంటే.. ఐపీఎల్ తో పోల్చి చూడాలి. ఐపీఎల్ మ్యాచ్ లను చూసినట్లే ఈ లీగ్ నూ ఆదరించారు. సహజంగానే ఇందులో తెలుగువారి పాత్ర అధికం అని చెబుతుంటారు. అయితే, మనదగ్గర క్రమంగా వ్యూయర్ షిప్ పడిపోసాగింది. ఉత్తర భారత దేశంలో మాత్రం నిలకడగా ఉంది. ఎక్కువ శాతం తెలుగు ఆటగాళ్లు లేకపోవడం తెలుగు వారి ఆదరణ తగ్గడానికి కారణం ఏమో? కొత్త కూతతో.. పోటీకి తొడగొడుతూ... ఎప్పుడైనా కాలానికి తగ్గట్లు మారాల్సిందే. అందులోభాగంగానే ప్రో కబడ్డీ లీగ్ నిర్వాహకులు మళ్లీ వ్యూయర్ షిప్ పెంచే చర్యలు చేపడుతున్నారు. ఇదివరకటి సాధారణ పాయింట్ల పద్ధతి కాకుండా టై మ్యాచ్ లకు షూటౌట్ రైడ్స్, గోల్డెన్ రైడ్ వంటివి అమల్లోకి తేనున్నారు. ఫలితం డ్రాగా మిగలకుండా ఫలితం తేల్చేందుకు ఈ విధానాన్ని ఎంచుకున్నారు. దీంతో ఆట రసవత్తరంగా సాగుతుందని భావిస్తున్నారు. తొలి మ్యాచ్ లో తెలుగు వీరులు.. 3వ వంతుపైగా ఫీజు ఫైన్ 12వ సీజన్ లో 12 జట్లు బరిలో ఉన్నాయి. తొలి మ్యాచ్ లో తెలుగు టైటాన్స్ –తమిళ్ తలైవాస్ తలపడనున్నాయి. శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆటగాళ్లను ప్రత్యేకంగా సన్మానించి.. ట్రోఫీని ఆవిష్కరించనున్నారు. విశాఖ నుంచి జైపూర్, చెన్నై, ఢిల్లీలలో మ్యాచ్ లు జరగనున్నాయి. మొత్తం 108 మ్యాచ్ లు నిర్వహించనున్నారు.

## సెలక్టర్ల పై విసుగెత్తిన
# స్టార్ క్రికెటర్... రిటైర్మెంట్ నిర్ణయం...?



ఫిట్‌గా ఉన్నట్లు చెప్పినా.. దేశవాళీ ఆడబోతున్నట్లుగా చెప్పినా.. టి20 ఫార్మాట్ లో జరగబోతున్న ఆసియా కప్ నకు తనను ఎంపిక చేయకపోవడంతో స్టార్ క్రికెటర్ తీవ్ర అసహనంతో ఉన్నట్లున్నాడు...! ఇంగ్లండ్ తో సిరీస్ కు ముందు కూడా తనకు ఇదే అనుభవం ఎదురవడంతో విసుగు చెందినట్లు కనిపిస్తున్నాడు...! పైకి తిరిగి తన రిటైర్మెంట్ పై కథనాలు వస్తుండడంతో ఆగ్రహానికి గురయ్యాడు.. అతడి తాజా వ్యాఖ్యలు ఇదే విషయం చెబుతున్నాయి. టీమ్ ఇండియా స్టార్ పేస్ బౌలర్ మొహమ్మద్ షమీ ఈ ఏడాది ఐపీఎల్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ కు ప్రాతినిధ్యం వహించాడు. కానీ, మెరుగ్గా బౌలింగ్ చేయలేకపోయాడు. జట్టు విజయాలకు తోడ్పడలేదు. సాదాసీదా పేసర్ లా కనిపించిన షమీని కొన్ని మ్యాచ్ లకు పక్కనపెట్టారు. 2023 వన్డే ప్రపంచ కప్ ఫైనల్ అనంతరం మోకాలి గాయంతో ఏడాదికి పైగా క్రికెట్ కు దూరమైన షమీ.. నిరుడు దేశవాళీ క్రికెట్ తో రీ ఎంట్రీ ఇచ్చాడు. ఆపై ఐపీఎల్ కు రూ.10 కోట్లకు పైగా పెట్టి సన్ రైజర్స్ కొనుక్కుంది. ఈ ధరకు తన ప్రతిభకు కూడా షమీ న్యాయం చేయలేదనే చెప్పాలి. దీనికి కారణం.. గాయం తాలూకు ప్రభావం అని విశ్లేషణలు వచ్చాయి. అందుకే మేటి పేసర్ బుమ్రా ఫిట్ నెస్ పై అనుమానాలు ఉన్నప్పటికీ షమీని ఇంగ్లండ్ టూర్ కు తీసుకెళ్లలేదు. తాజాగా వచ్చే నెల 9 నుంచి జరిగే ఆసియా కప్ నకూ పరిగణించలేదు.ఐదు టెస్టుల ఇంగ్లండ్ టూర్, టి20 ఫార్మాట్ లో జరగబోయే ఆసియా కప్ నకు షమీ ఎంపికపై చర్చ జరిగిందా? అని సెలక్టర్లను ప్రశ్నిస్తే, తాము షమీని సంప్రదించామని చెబుతున్నారు. అతడు పూర్తి ఫిట్ గా లేడనే ఎంపిక చేయలేదని కథనాలు వస్తున్నాయి. దీంతో ఇంతకూ ఏం జరుగుతోంది? అనే ప్రశ్నలు వస్తున్నాయి. ఇవన్నీ తన భవిష్యత్, సామర్థ్యంపై అనుమానాలు రేకెత్తించేవి కావడంతో షమీ కూడా తీవ్రంగా స్పందించాడు. నాతో ఎవరికైనా సమస్య ఉంటే చెప్పండి... నా రిటైర్మెంట్ తో వారి జీవితాలు బాగుపడతాయని భావిస్తే చెప్పండి.. నాకు విసుగు వచ్చిన రోజు వెళ్లిపోతాను.. నన్ను జాతీయ జట్టుకు ఎంపిక చేయకుంటే దేశవాళీకి ఆడతాను.. అని నేరుగా సెలక్టర్లకు అల్టిమేటం ఇచ్చినట్లు మాట్లాడాడు. 34 ఏళ్ల షమీ ప్రస్తుతం ఈస్ట్ జోన్ తరఫున దులీప్ ట్రోఫీకి ఆడుతున్నాడు. ఇది టెస్టు ఫార్మాట్ లో జరుగుతోంది. ఈ ఫార్మాట్ కు సిద్ధంగా ఉన్నా.. టి20 ఫార్మాట్ లో జరిగే ఆసియా కప్ నకు ఎంపిక చేయలేదు. ఇదే ప్రశ్నను షమీ లేవనెత్తాడు. ఫిట్ గా ఉన్నట్లు భావిస్తే ఎంపిక చేయండి.. లేదంటే లేదు అని అల్టిమేటం ఇచ్చాడు. కానీ, సెలక్టర్లు హర్షిత్ రాణా వంటి యువ బౌలర్ల వైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇక వన్డేలు అప్పుడో ఇప్పుడో ఒకటి జరుగుతుంటాయి. టెస్టులకు ఎలాగూ షమీని పరిగణించడం లేదు. అందుకని ఏం నిర్ణయం తీసుకుంటాడో చూడాలి. మరోవైపు 2027 వన్డే ప్రపంచ కప్ ఆడాలనేది షమీ కలగా తెలుస్తోంది. కానీ, ఫిట్ నెస్ సహకరిస్తుందా? అన్నది చూడాలి. ఏదేమైనా ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్ కు కూడా ఎంపిక చేయకపోతే షమీ ఏదో ఒక నిర్ణయం తీసుకోవడం ఖాయం.

సూర్య వాస్తవం
Truth of News
http://www.suryavastavam.in



# కుప్పం అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వండి

**- పారిశ్రామికవేత్తలను కోరిన చంద్రబాబు**

**- కుప్పం ప్రాంత అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో 6 ఎంఓయూలు**



**కుప్పం -సూర్య వాస్తవం, ఆగస్టు 30:** కుప్పం నియోజకవర్గ అభివృద్ధి కోసం పారిశ్రామికవేత్తలు తోడ్పాటు అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కోరారు. ఇందుకు సంబంధించి కుప్పం పరిధిలో వ్యర్థాల నుంచి సంపద తయారీ కార్యక్రమం అమలు కోసం ఏజీఎస్- ఐటీసీ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. వ్యర్థాల సుస్థిర నిర్వహణపై ఇంటింటి ప్రచారం చేయడం పాఠశాలల్లో అవగాహనా కార్యక్రమాలను 15 ఏళ్ల పాటు నిర్వహించేలా ప్రభుత్వం సదరు సంస్థతోఈ ఒప్పందం కుదుర్చుకుంది. కుప్పంలో మహిళా పారిశ్రామికవేత్తలను తయారుచేయటం, మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులకు గ్రామీణ ప్రాంతాల్లో మార్కెటింగ్ అంశాలపై షీలీడ్స్ అనే సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా కుప్పం నియోజకవర్గంలో 10వేల మంది మహిళల్ని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయటంతో పాటు గ్రామీణ మార్కెట్లను అందిపుచ్చుకునేలా శిక్షణ ఇచ్చేందుకు షీ లీడ్స్ సంస్థ ఎంఓయూ కుదుర్చుకుంది.కుప్పంలో ఫైబర్ బోర్డు ఉత్పత్తి కోసం కింగ్స్ వుడ్ డెకార్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థతో అధికారులు ఎంఓయూ కుదుర్చుకున్నారు.రూ.1,100 కోట్ల పెట్టుబడితో మీడియం డెన్సిటీ ఫైబర్ బోర్డును కింగ్స్ వుడ్ సంస్థ ఉత్పత్తి చేయనుంది. ఈ యూనిట్ ఏర్పాటుతో 2012 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నట్లు ఆ సంస్థ యాజమాన్యం తెలిపారు.కుప్పంలో 2 సీటర్ ట్రైనింగ్ ఎయిర్ క్రాఫ్ట్ తయారీ యూనిట్ ఏర్పాటు చేసేందుకు పయనీర్ క్లీన్ యాంప్స్ లిమిటెడ్ అనే సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది.రూ.150 కోట్ల పెట్టుబడితో ఏడాదికి 70 నుంచి 100 శిక్షణకు ఉపయోగించే 2 సీటర్ విమానాలను తయారు చేసేందుకు పయనీర్ క్లీన్ ఆంప్స్ లిమిటెడ్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా మొత్తం 250 మందికి పయనీర్ క్లీన్ ఆంప్స్ సంస్థ ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు కల్పించనుంది. బెంగుళూరుకు కు చెందిన స్పేస్ టెక్నాలజీ సంస్థ ఎత్రెయాల్ ఎక్స్ ప్లోరేషన్ గిల్డ్ సంస్థతో ప్రభుత్వం అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. మీడియం లిఫ్ట్ లాంచింగ్ రాకెట్ రేజర్ క్రెస్ట్ ఎంకె-1 తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం అధికారులు అవగాహనా ఒప్పందం చేసుకున్నారు.రూ. 500 కోట్ల పెట్టుబడిని మూడు దశల్లో పెట్టేలా కార్యాచరణ రూపొందించారు. మొత్తం 500 మందికి ఈ సంస్థ ద్వారా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ హబ్ ఏర్పాటు చేసేందుకు రెడ్ బెర్రీ ఫుడ్ లాజిస్టిక్స్ అనే సంస్థతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. రూ.300 కోట్ల పెట్టుబడితో 15 వేల మందికి ఉపాధి కల్పించేలా ప్రతిపాదన సమర్పించిన రెడ్ బెర్రి ఫుడ్ లాజిస్టిక్స్ సంస్థ మామిడి, జామ, టమాటో పల్పింగ్ యూనిట్లను ఏర్పాటు చేయన్నుంది.

## గర్భస్థ పిండ లింగ


# నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తప్పవు

**- డిఎంహెచ్ఓ డా.ఈ.బి.దేవి**




**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం, ఆగస్టు 30 :** జిల్లాలో ఉన్న స్కానింగ్ సెంటర్లలో ఎక్కడైనా గర్భస్థ పిండలింగ నిర్ధారణ చేసినట్లు ఆరోపణ వచ్చి రుజువైతే గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టరీత్య కఠిన చర్యలు తప్పవని జిల్లావైద్య ఆరోగ్య శాఖ అధికారిణీ డా.ఈ.బి. దేవి హెచ్చరించారు. శనివారం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని తన చాంబర్ లో జిల్లా స్థాయి గర్భస్థ పిండలింగ నిర్ధారణ కమిటీ సమావేశం డిఎంహెచ్ఓ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ జిల్లాలో జరుగుతున్న భ్రూణ హత్యల గురించి ఆరాతీశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్ లు, డయాగ్నస్టిక్ సెంటర్లు అనుమతి లేకుండా నడుపుతుంటే వాటిపై ప్రభుత్వ నిబంధన మేరకు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా ఎట్టి పరిస్థితుల్లోనూ లింగ నిర్ధారణ పరీక్షలు జరపకూడదని, చట్టాన్ని అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఇంకా నిర్ధారణ కోసం ప్రయత్నించిన లేదా ప్రోత్సహించిన అట్టివారిపై కూడా చర్యలు తప్పవని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో ఉన్నటువంటి ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు గర్భవ తులకు వైద్య సేవలు అందిస్తూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం ప్రకారం లింగ పరీక్షల నేరమని, ఆడపిల్ల అయినా మగపిల్ల అయినా సమానమే అని తెలియజేసే విధంగా వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల భాగస్వామ్యంతో విస్తృతంగా వివిధ మాధ్యమాల ద్వారా ప్రచార అవగాహన కార్యక్రమాలు జిల్లాలో విస్తృతంగా చేపట్టినట్లు తెలిపారు. అలాగే జిల్లాలో లింగ నిష్పత్తి కన్నా తక్కువగా ఉన్న అన్ని మండలాల్లో పటిష్టమైన ప్రణాళికలు రూపొందించి వాటన్నింటినీ ప్రతినెల సంబంధిత అధికారులకు ప్రగతి నివేదికలను తీసుకొని సమీక్షించడం జరుగుతున్నదని తెలిపారు. జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణను అరికట్టే క్రమంలో ఐసిడిఎస్, మెప్మా, పోలీసు, స్వచ్ఛంద సంస్థల సమన్వయ సహకారాలతో పటిష్ట చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు కూడా ఆడపిల్లల యొక్క ప్రాముఖ్యతను తెలుసుకోవాలని, ఆయా కుటుంబసభ్యులు లింగ నిర్ధారణ పరీక్షలు చేపట్టరాదని సూచించారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ వారి ఆదేశం మేరకు గర్భస్థ లింగ నిర్ధారణ చట్టంపై ప్రజలకు ఆకాశవాణి కేంద్రం ద్వారా సందేశాత్మకంగా అవగాహన కల్పించడం జరిగిందని, అలాగే అనంతపురం ప్రధాన కేంద్రంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 08554- 288234 ఫోన్ నెంబర్ ద్వారా ప్రత్యేకంగా ఒక సెల్ ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా వీడియోను రూపొందించి చట్టంపై ప్రచారం కల్పిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు, కాలేజీలలో విద్యార్థులకు కూడా లింగ నిర్ధారణ చట్టం ఆవశ్యకత గురించి అవగాహన కార్యక్రమాలు శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో ప్రోగ్రామ్ అధికారులు డా.యుగంధర్, డా అనుపమ, డా.నారాయణస్వామి, డా. శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ విష్ణుమూర్తి, సర్వజన ఆసుపత్రి చిన్నపిల్లల వైద్యులు డా.రవికుమార్, స్త్రీ వ్యాధి నిపుణులు డాక్టర్ పద్మశ్రీ, పాథ్యాలజీ నిపుణులు డా.దీప్తి, స్వచ్ఛంద సంస్థ ఆర్.డి.టి ప్రతినిధి డా.దుర్గేశ్, రెడ్స్ సంస్థ అనిత, ఐసిడిఎస్ వెంకటేశ్వరి, డెమో త్యాగరాజు, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

# సంచారజాతుల దినోత్సవంలో పాల్గొన్న బీజేపీ ఉపాధ్యక్షులు



**రాయదుర్గం × సూర్య వాస్తవం, ఆగస్టు 30 :** భారతీయ జనతా పార్టీ ప్రతి కులానికి ప్రాధాన్యత ఇస్తూ, అట్టడుగు స్థాయిలో ఉన్న కులాలను ఉన్నతమైన కులాలుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా బీజేపీ ఒక గొప్ప స్ఫూర్తితో శనివారం విజయవాడలో సంచార జాతుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు కాపు రామ చంద్రారెడ్డి పాల్గొన్నారు. అనంతరం బిజెపి ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రతి కులానికి స్ఫూర్తిదాయకంగా వ్యవహ రించడంతోపాటు, కులాల అభివృద్ధి ధ్యేయంగా భారత జనతా పార్టీ ముఖ్య ఉద్దేశమని ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి అన్నారు. రాష్ట్రంలో సంచార జాతులు కులాలు అంతరిం చిపోవడంతో సంచారజాతులకు భారతీయ జనతా పార్టీ ఒక గొప్ప స్ఫూర్తి కార్యక్రమం ఏర్పాటు చేసి, సంచార జాతుల కులానికి సంబంధించిన వ్యక్తులను ఈ కార్యక్రమానికి అనుగుణం చేసి వారి అభివృద్ధి తోడ్పడడం, సంచార జాతుల దినోత్సవం విజయవాడ వేదికలో భారతీయ జనతా పార్టీ ఈ కార్యక్రమాన్ని సంచార జాతుల వ్యక్తులతో కలిసి దినోత్సవ వేడుకలు నిర్వహించడం ఒక స్ఫూర్తి గా పరిగ ణించవచ్చని రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు కొని యాడారు. రాబోయే రోజుల్లో సంచార జాతుల కులాలకు భారత ప్రధాని, రాష్ట్ర అధ్యక్షులు రాష్ట్ర బిజెపి పార్టీ అన్ని విధాలుగా వారి అభివృద్ధికి తోడ్పడుతామని ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షురాలు కాపు, బిజెపి నాయకులు , సంచార కులస్తులు , రామ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంచార జాతుల వేషధారణలో నృత్య ప్రదర్శనలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



## వినాయక ఉట్టి మహోత్సవంలో

# పోట్లపూడి రాజేష్ స్నేహ బృందం



**నాయుడుపేట -సూర్య వాస్తవం, ఆగస్టు 30:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నాయుడుపేట పట్టణం లోని దర్గా రోడ్ లో నాయుడుపేట వినాయక చవితి కమిటీ ఆధ్వర్యంలో భారీ సినిమా సెట్టింగులతో శోభాయ మానంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం శనివారం ఉట్టి మహొత్సవ కార్యక్రమం కమిటీ సభ్యులు నిర్వహించారు.వినాయక చవితి పర్వదినం ప్రారంభమైన నాటి నుండి నేటి వరకు ఇక్కడ వినాయక విగ్రహం వద్ద వైభవంగా భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ,తీర్థ ప్రసాదాలు అందజేస్తున్నారు.ఇప్పటికే ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు,నాయుడుపేట పట్టణ సిఐ బాబీ లతోపాటు పార్టీలకతీతంగా పలువురు నాయకులు, అధికారులు పట్టణ ప్రముఖులు, వేలాదిమంది ప్రజలు దర్గా రోడ్ లోని వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి ఆశీర్వాదం పొందారు. ఈ నేపథ్యంలో శనివారం జరిగిన ఉట్టి కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కాగా సెప్టెంబర్ నాలుగో తేదీన వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమం అంగారంగ వైభవంగా నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నాయుడుపేట వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు ఎస్ జె జువెలర్స్ అధినేత, టిడిపి నేత పోట్లపూడి రాజేష్, ఉత్సవ కమిటీ సభ్యులు భారతాల సాయిరామ్ కిషోర్,గోనుపల్లి గురుమూర్తి,బల్లి కుమార్,ఆవుల సుధాకర్ బయ్యా రమేష్,బయ్యా రామారావు,దేవత గోపి,శంకర్లాల్, సొల్లేటి రమేష్, చింతం రెడ్డి మురళి, స్టాలిన్, డిటిడిసి సురేష్,వెంకయ్య,నజీర్,దయాకర్ సత్య,రామకృష్ణ, రాఘవ,మధు,మౌనేష్, సొల్లేటి మోహన్ పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సివిల్ రైట్స్ డే నిర్వహణ






**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, ఆగస్టు 30:** జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లాలో పోలీసులు పౌర హక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే ) నిర్వహించారు. ప్రతి నెల చివరి రోజున పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జిల్లాలోని పలు పోలీసు స్టేషన్ల పరిధుల్లో పోలీస్, రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాలను సందర్శించి అవగాహన సదస్సులు నిర్వహించి చట్టాల గురించి వివరించారు. అసమానతలు, అంటరానితనం, కుల వివక్షతను నిర్మూలించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ... ఈదిశగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ అధికారులు గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )